జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

### ఆగస్టు 5న ప్రజల ముందుకు..

**అజ్ఞాతం వీడనున్న షేక్ హసీనా**
**స్వదేశానికి తిరిగి వెళ్లే అవకాశం**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి తర్వాత తొలిసారిగా బహిరంగంగా కనిపించనున్నారు. విద్యార్థుల ఆందోళనల కారణంగా పదవి కోల్పోయి ఏడాదికి పైగా ప్రవాసంలో ఉన్న ఆమె, ఆగస్టు 5న తన మొదటి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. బంగ్లాదేశ్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, దేశంలో

మిగతా 2లో..

### జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు

**సమాజంలో మోదీకి అండగా అన్ని వర్గాలు**
**దేశాన్ని మాదక ద్రవ్య రహితంగా మారుస్తాం**
**కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ కీలక వ్యాఖ్యలు**

జెన్ జీ ఎల్లప్పుడూ బీజేపీతోనే ఉన్నారని, సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీకి అండగా నిలుస్తుందనే నమ్మకం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఆదివారం అన్నారు. మోదీ ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్

మిగతా 2లో..

ఆదిలాబాద్, హైదరాబాద్ | సోమవారం 03 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 149 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# స్మార్ట్ రేషన్..

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పదేళ్లుగా ఉపయోగిస్తున్న కాగితపు రేషన్ కార్డుల స్థానంలో భద్రతా ప్రమాణాలు, డిజిటల్ సదుపాయాలతో కూడిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌర సరఫరాల శాఖ కార్యాలయాలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.




## ఇక ఏటీఎం తరహా స్మార్ట్ రేషన్ కార్డులు!

**రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకతకు పెద్దపీట**
**అక్రమాలకు ముగింపు పలికేందుకు చర్యలు**
**ఏటీఎం తరహా స్మార్ట్ రేషన్ కార్డుల జారీకి సిద్ధం**
**క్యూఆర్ కోడ్, కుటుంబ యజమాని ఫొటోతో కార్డు**



ప్రజలకు రేషన్ సరుకులు తీసుకునే క్రమంలో ఎదురౌతున్న ఇబ్బందులకు త్వరలోనే చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచి, అక్రమాలకు ముగింపు పలికేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దకాలంగా వాడుకలో ఉన్న పాత కాగితపు రేషన్ కార్డుల స్థానంలో పీవీసీ, ఏటీఎం తరహా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెడుతోంది. క్యూఆర్ కోడ్, కుటుంబ యజమాని ఫొటోతో ముద్రించిన ఈ కొత్త కార్డులు ఇప్పటికే అన్ని జిల్లాల పౌరసరఫరాల కార్యాలయాలకు చేరుకున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల కాగానే వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో ఉన్న పాత కార్డులు నలిగిపోవడం, తడిసి పాడైపోవడం వల్ల లబ్ధిదారులు నెట్‌సెంటర్లలో ఆన్‌లైన్ ప్రింట్లు తీసుకుని తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలలో భాగంగా అర్హులైన నిరుపేదలందరికీ కొత్త డిజిటల్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. దానికి అనుగుణంగా తయారు చేసిన కొత్త స్మార్ట్ కార్డు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటోతో పాటు ప్రత్యేకమైన రేషన్ కార్డు సంఖ్యను స్పష్టంగా ముద్రించారు. కార్డు వెనుక భాగంలో అధునాతన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు, వారి వయస్సు, ఆధార్

మిగతా 2లో..

## యుద్ధం ఆగింది

- శాంతి చర్చల్లో కీలక ముందడుగు
- ఇరాన్‌పై దాడులు ఆపేస్తున్నాం
- డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- ఒప్పందం కుదిరినట్లు వెల్లడి
- తాత్కాలికంగా నిలిపేసిన అమెరికా
- మిత్రదేశాల సంధితో విరమణ
- ఆరు నెలల యుద్ధానికి ముగింపు?..
- ఇరాన్‌తో నేటినుంచి కొత్త చర్చలు



ఇరాన్‌పై దాడులు, శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాల అభ్యర్థన మేరకు.. ఆ దేశంపై దాడులకు వేసిన ప్రణాళికలను వాయిదా వేయడానికి అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించాయని ట్రంప్ శనివారం ప్రకటించారు. యుద్ధాన్ని ముగించేందుకు పశ్చిమాసియాలోని మిత్రదేశాలు ఒక ఒప్పందానికి సంబంధించిన ప్రాథమిక అవగాహన కుదుర్చుకున్నామని, హర్మూజ్ జల సంధిని తక్షణమే తెరుచుకోనుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు."ఈ కొత్త ఒప్పందం ద్వారా ఫిబ్రవరి 28న యుద్ధం

మిగతా 2లో..

## వారం రోజుల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ!

**పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**
**అర్హులైన వారి నివేదిక పంపాలని సూచన**



తెలంగాణలో అన్ని స్థాయిల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులు, పీఏసీఎస్ పదవుల భర్తీకి అర్హులైన పార్టీ కార్యకర్తల పేర్లతో నివేదికలను వారంలోగా పంపాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను ఆదేశించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి 60 శాతం పోస్టులు ఇచ్చేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఈ విషయమై గాంధీభవన్‌లో మంత్రి తుమ్మల, ఎంపీ వేం నరేందర్‌రెడ్డిలతో సమీక్ష నిర్వహించి, ఇన్‌ఛార్జి మంత్రుల సమన్వయంతో తుది జాబితాను సీఎం రేవంత్‌రెడ్డికి అందించనున్నారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్ననామినేటెడ్ పోస్టులు,

మిగతా 12లో..

## దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లు

- ప్రపంచ కంపెనీలను నడుపుతున్న భారత ఇంజినీర్లు
- ఇంజినీర్లను 'క్రిమినల్ వేస్ట్' సిఎం రేవంత్ అనడమేంటి?
- సీఎం చేసిన కామెంట్స్‌పై రాహుల్ గాంధి స్పందించాలి
- రాహుల్ కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఇంజినీర్లను 'క్రిమినల్ వేస్ట్' అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామెంట్స్‌పై ఈ లేఖ రాసినట్లు చెప్పుకొచ్చారు. ఒకవైపు భారతదేశ

మిగతా 12లో..

## పాకిస్థాన్‌లో నరమేథం

**శాంతి ర్యాలీలో ఆత్మాహుతి దాడి..**
**14మంది మృతి, 18 మందికి గాయాలు**




పాకిస్థాన్‌లో భద్రతా బలగాలే లక్ష్యంగా ఉగ్రదాడులు కొనసాగుతున్నాయి. తాజాగా, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల్లో ఆదివారం శాంతి ర్యాలీపై ముష్కర మూకలు ఆత్మాహుతి దాడికి తెగబడ్డాయి. స్వాత్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో 14మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 18 మంది గాయపడ్డారు. ఆత్మాహుతి దాడికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. ఈ పేలుడు ఆత్మాహుతి దాడిలా కనిపిస్తున్నప్పటికీ, దీనిపై తక్షణ అధికారిక ధ్రువీకరణ ఏదీ లేదని పీటీఐ వార్తా సంస్థ నివేదించింది. రెస్క్యూ బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు,

మిగతా 2లో..

## ఇండోనేషియాలో ఘోర ప్రమాదం

**మదురా ద్వీపంలో ఓ ఫెర్రీకి మంటలు**
**ఐదుగురు మృతి, మరో 41 మంది గల్లంతు**



ఇండోనేషియాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మదురా ద్వీపంలో ఓ ఫెర్రీకి మంటలు అంటుకుని, కనీసం ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో 41 మంది గల్లంతయ్యారు. ప్రమాద సమయానికి ఫెర్రిలో 270 మందికిపైగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. తూర్పు జావా ప్రావిన్సులు సురబయలోని తంజుంగ్

మిగతా 12లో..

## డ్రగ్స్ నిర్మూలనకై పోరాడుదాం

- ఈ మహమ్మారి నుంచి యువతను కాపాడాలి
- లక్ష్య సాధనలో యువత ఆరోగ్యమే అత్యంత కీలకం
- దేశాభివృద్ధికి డ్రగ్స్ రహిత సమాజం అవసరం
- స్మగ్లర్లు, డ్రగ్స్ దుర్వినియోగంపై కఠిన చర్యలు
- "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"లో ప్రధాని మోదీ



భారత్ లక్ష్య సాధనలో యువత ఆరోగ్యమే అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"లో భాగంగా చేపట్టిన మాదకద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని

మిగతా 2లో..



## లష్కర్ బోనాలతో సికింద్రాబాద్ భక్త ప్రభంజనం

**ఘనంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు**
**అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు**
**అమ్మవారికి బోనం సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని చరిత్రాత్మక శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానంలో ఆషాఢ మాస లష్కర్ బోనాలు ఆదివారం రంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివస్తున్నారు. మహిళలు సాంప్రదాయ

మిగతా 12లో..

## పేదలను విద్యకు దూరం చేస్తారా?

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- రేవంత్ కు విద్యార్థుల ఉసురు తగులుతుంది
- ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుంది
- ప్రభుత్వంపై ఆర్ కృష్ణయ్య తీవ్ర విమర్శలు



విద్యార్థుల ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థుల కష్టాలు చెప్పతరం కావడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఉసురు తగిలి రేవంత్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని తీవ్రస్థాయిలో

మిగతా 12లో..

# సంపాదకీయం

## యువ నిరసన ఆరంభం మాత్రమే!!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరగోళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతుంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోదీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోదీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతున్నా రాకుండా దొడ్డం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోదీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరొటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అనువైన నిర్ణయాలు తక్కువగా జరుగుతున్నాయి. ఇటీవలే రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు దొంగ అని ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

# స్మార్ట్ రేషన్..

మొదటిపేజీ తరువాయి..

అనుసంధాన వివరాలు క్షణాల్లో తెలుసుకునే సాంకేతికతను రూపొందించారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలో లేదా దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా వన్ నేషన్ - వన్ రేషన్ విధానం కింద ఏ రేషన్ దుకాణంలోనైనా సరుకులు సులభంగా పొందే వీలుంటుంది. క్యూఆర్ కోడ్ ఆధారంగా వేలిముద్రలు, ఐరిస్ స్కాన్ నిర్వహించి సరుకులు కేటాయిస్తారు. ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్న అర్హులైన లబ్ధిదారుల సమాచారం, కొత్తగా దరఖాస్తు చేసుకున్న డేటా ఆధారంగా ఈ స్మార్ట్ కార్డుల ముద్రణను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలకు రవాణా చేశారు. ఈ నూతన విధానంపై పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. జిల్లాలకు ఇప్పటికే సరిపడా పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల స్టాక్ చేరుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి పంపిణీ ప్రారంభ తేదీలు, మార్గదర్శకాలు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు వీటిని అందజేస్తామని వెల్లడించారు. ఈ కొత్త కార్డుల రాకతో కార్డుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడటంతో పాటు నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



# యుద్ధం ఆగింది

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభమైనప్పటి నుంచి మూతపడిన ఇంధన రవాణా మార్గమైన 'హర్మూజ్ జలసంధి'తక్షణమే, పూర్తిస్థాయిలో తెరవాల్సి ఉంటుంది" అని తెలిపారు. "రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేనంత సైనిక బలం, శక్తితో ఇరాన్‌పై విరుచుకుపడేందుకు అమెరికా పూర్తి సిద్ధంగా ఉంది. అయినప్పటికీ, ఒక ఒప్పంద రూపకల్పనపై ప్రాథమిక అంగీకారం కుదరడంతో దాడులను వాయిదా వేయాలని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు మమ్మల్ని కోరాయి. ఈ ఒప్పందంలో హర్మూజ్ జలసంధిని తక్షణమే, పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు ముప్పును అంతం చేయడం వంటి అంశాలు ఉన్నాయి" అని ట్రంప్ తెలిపారు. "ఈ అభ్యర్థనతో ప్రపంచ శ్రేయస్సు కోసం అలాగే విజయవంతమైన, సంపన్నమైన ఇరాన్ మనుగడ కోసం దాడులను నిలిపివేయడానికి నేను అంగీకరించాను. అయితే ఇది త్వరగా ఒప్పందం కుదుర్చుకోవడంపై ఆధారపడి ఉంటుంది" అని ట్రంప్ స్పష్టం చేశారు. అలాగే, ఇజ్రాయెల్ సైతం ఇరాన్‌తో ఒప్పందాన్ని పూర్తి చేసి, యుద్ధాన్ని ముగించేందుకు కలిసి పనిచేయడానికి అంగీకరించిందని ట్రంప్ చెప్పారు. 'అందరం కలిసి ఈ పనిని పూర్తిచేద్దాం' అని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో భారీ దాడులకు ప్లాన్ చేస్తున్నట్టు అమెరికా మీడియాలో కథనాలు వెలువడిన వేళ.. ఇరాన్‌ను చాలా తీవ్రంగా దెబ్బతీస్తామని ట్రంప్ హెచ్చరించారు.

క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ఇరాన్ దారికి వచ్చేలా దాడులకు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారని, ఇవి శని, ఆదివారాల్లోనే ప్రారంభం కావచ్చని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌కు చెందిన ఇంధన సంబంధిత లక్ష్యాలపై ఉమ్మడి దాడులకు ప్రణాళిక చేసినట్లు సీబీఎస్ న్యూస్ తెలిపింది. ఈ దాడులకు ట్రంప్ ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వనప్పటికీ, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సమన్వయం కొనసాగుతోందని పలు వర్గాలను ఉటంకిస్తూ నివేదించింది. యుద్ధం ప్రారంభమైన మొదటి దశ తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై దాడుల్లో భాగస్వామ్యం కావడం ఇదే తొలిసారి కానుంది.

మరోవైపు ఈ యుద్ధంలో ఇరువైపులా భారీ ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లింది. అయినాసరే వెనక్కి తగ్గడం లేదు. ఇక, ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు, పౌరులను నిర్బంధించి, వారిపై లైంగిక హింసకు పాల్పడుతోన్న రష్యా.. యుద్ధంలో దీనిని ఓ ప్రధాన ఆయుధంగా చేసుకుంది. ఈ నేపథ్యంలో రష్యా దారుణాలపై వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ సంచలన నివేదికను వెలువరించింది. ఆక్రమిత ప్రాంతాల్లోకి ఐరాస విచారణ అధికారులను రష్యా అనుమతించడం లేదు. ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు, పౌరులపై లైంగిక హింసను ఒక క్రమబద్ధమైన ఆయుధంగా రష్యా దళాలు ఉపయోగిస్తున్నాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన నివేదిక వెల్లడించింది. సైనికులు, పౌరుల సహా బాధితులను మానసికంగా దెబ్బతీయడం, అవమానించడమే లక్ష్యంగా అత్యాచారాలు, వారి ప్రయివేట్ భాగాలను విచ్ఛిన్నం చేయడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి విచారణాధికారులు, ఉక్రెయిన్ ప్రాసిక్యూటర్లు, బాధితుల వాంగ్మూలాల ఆధారంగా ఈ నివేదికను వాల్‌స్ట్రీట్ జర్నల్ రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2022లో పూర్తిస్థాయి దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుంచి రష్యా సైన్యాలు ప్రధానంగా ఉక్రెయిన్‌కు చెందిన యుద్ధ ఖైదీలు ముఖ్యంగా పురుషులపైనే ఈ రకమైన లైంగిక చిత్రహింసలను ఎక్కువగా ప్రయోగించాయి. సెర్హి బోయ్‌చుక్ అనే ఉక్రెయిన్ మాజీ యుద్ధ ఖైదీ వాల్‌స్ట్రీట్ జర్నల్‌తో మాట్లాడుతూ.. తనను రష్యా సైనికులు 2022లో నిర్బంధించారని తెలిపాడు. నిర్బంధ కేంద్రంలో రష్యన్ గార్డులు తనను రెండేళ్ల పాటు తనను దారుణంగా కొట్టడమే కాకుండా.. లైంగికంగా చిత్రహింసలకు గురిచేశారని వాపోయాడు. 'వారు నన్ను మానసికంగా కుంగదీయాలని అనుకున్నారు' అని తాను ఎదుర్కొన్న భయానక అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. బాటిళ్లు, కర్రలతో తనపై అత్యాచారం చేశారని, జననాంగాలపై కత్తి ఉంచి భయపెట్టారని వివరించాడు. అక్టోబర్ 2024లో ఖైదీల మార్పిడిలో భాగంగా బోయ్‌చుక్ విడుదలయ్యాడు. "ఒక వ్యక్తిని అవమానించి, మానసికంగా దెబ్బతీయడానికి వారు లైంగిక వేధింపులను ఒక యుద్ధ ఆయుధంగా ఉపయోగిస్తున్నారు" అని బోయ్‌చుక్ ఆవేదన వ్యక్తం చేశాడు. మరో యుద్ధ ఖైదీ సైతం శిబిరాల్లో తనకు ఎదురైన ఇటువంటి లైంగిక చిత్రహింసల అనుభవాలనే పంచుకున్నాడు. దాదాపు నాలుగున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధంలో మాజీ ఖైదీలను విస్తృతంగా ఇంటర్వ్యూ చేసిన ఉక్రెయిన్ నిఘా వర్గాలు, ఐక్యరాజ్యసమితి విచారణాధికారుల అంచనాలకు బాధితుల కథనాలు పూర్తి ఆధారంగా నిలుస్తున్నాయి. యుద్ధ ఖైదీలు, పౌరులపై రష్యా జరుపుతున్న ఈ లైంగిక హింస ఒక పద్ధతి ప్రకారం జరుగుతోందని, దీనికి రష్యా ఉన్నతాధికారుల ప్రోత్సాహం కూడా ఉందనడానికి ఆధారాలు ఉన్నాయని విచారణాధికారులు పేర్కొన్నారు. యుద్ధ సమయంలో పౌరులను లొంగదీసుకోవడానికి, భయాందోళనలకు గురిచేయడానికి శత్రు దళాలు లైంగిక హింసను వినియోగించడం పాత పద్ధతే. అయితే, సాధారణంగా ఇలాంటి ఘటనల్లో మహిళలు, పిల్లలే ఎక్కువ మంది బాధితులుగా ఉంటారు. 2022లో దండయాత్ర ప్రారంభంలో ఉక్రెయిన్ నగరాలు, గ్రామాలపై రష్యా సైనికులు దాడి చేసినప్పుడు మొదట్లో మహిళలనే లక్ష్యంగా చేసుకున్నారని ఐరాస, వాల్ స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలు తెలిపాయి. అయితే, యుద్ధం దీర్ఘకాలికంగా మారుతున్న కొద్దీ యుద్ధరంగంలో పట్టుబడిన ఉక్రెయిన్ మగ సైనికులే ఈ దారుణాలకు ప్రధాన బాధితులుగా మారుతున్నారు. రష్యా దళాల లైంగిక హింసపై ఐరాస విచారిస్తున్న 310 కేసుల్లో.. 280 మంది పురుషులు, 26 మంది మహిళలు, నలుగురు బాలికలు ఉన్నారని తెలిపింది. బాధితులలో అత్యధికులు అత్యాచారం, గ్యాంగ్ రేప్, జననాంగాలను విచ్ఛిన్నం చేయడం, కరెంట్ షాక్‌లు ఇవ్వడం, వాటిపై దారుణంగా కొట్టడం వంటి చిత్రహింసలకు గురయ్యారని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

మరోవైపు ఇరు దేశాల మధ్య శాంతి చర్చలపైనే ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య మధ్యవర్తుల ద్వారా సోమవారం మధ్యాహ్నం నుంచి దౌత్యపరమైన చర్చలు ప్రారంభం అవుతాయని ప్రకటించారు. గల్ఫ్ దేశాల తీవ్ర ఒత్తిడి, విస్తృత సంప్రదింపుల నేపథ్యంలో సైనిక చర్యకు కాస్త విరామమిచ్చిన ట్రంప్, ఇరాన్‌తో చర్చలకు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఇరాన్‌తో చర్చలకు మార్గాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చెప్పారు. శాంతియుత ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల ఇరుపక్కలా భారీ ప్రాణనష్టాన్ని నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మేం ఇరాన్‌తో చర్చలు జరపబోతున్నాం. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈ చర్చలు ప్రారంభమవుతాయి. చర్చలు ఎలా సాగుతాయో చూద్దాం. నిజాయితీగా చెప్పాలంటే, ఇది చాలామంది ప్రాణాలను, అనవసరమైన శ్రమను ఆదా చేస్తుంది. మేము ఎప్పుడు అనుకుంటే అప్పుడు సైనిక చర్యకు సిద్ధంగా ఉన్నాం. నేను ప్రజలను చంపాలని అనుకోవడం లేదు, ఎందుకంటే సైనిక చర్యలో చాలామంది చనిపోతారు. అది మాకు ఇష్టం లేదు. అందుకే ఇరాన్‌తో పాటు మా ఇతర ప్రాంతీయ భాగస్వాములు కూడా మమ్మల్ని చర్చలకు ఒప్పుకోవాలని కోరారని తెలిపారు.

# డ్రగ్స్ నిర్మూలనకై పోరాడుదాం

మొదటిపేజీ తరువాయి..

ప్రధాని మోదీ తెలిపారు. దేశం 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మ విశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని సూచించారు. మాదకద్రవ్యాల స్మగ్లర్లు, డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోదీ చెప్పారు. అరెస్టులు గణనీయంగా పెరిగాయని, వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే తాత్కాలిక ఉత్సాహం మీ కెరీర్, వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తుందని అన్నారు. దేశ యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, ఇందుకోసం అన్ని రకాల డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో ప్రభుత్వం యువతకు అండగా నిలిచింది. దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గతంతో పోలిస్తే అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విషయంలో మా ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ఇది తెలియజేస్తుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ రోజు తీసుకున్న ఈ ప్రతిజ్ఞ రానున్న వంద వారాల పాటు స్థిరంగా ముందుకు సాగుతుంది. రానున్న 100 ఆదివారాలు 'మాదకద్రవ్య రహిత భారత్' దిశగా 100 బలమైన అడుగులు కానున్నాయి. మీరు భారతదేశ అమృత తరం. రానున్న 20-25 ఏళ్లలో మీరు మీ జీవితాలను తీర్చిదిద్దుకుంటారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తారు. సారథ్యం వహిస్తారు. దీని పూర్తి ప్రయోజనాలను పొందేది మీరే. దేశానికి మీ శక్తి, మీ సృజనాత్మకత, మీ ప్రతిభ అవసరం. కాబట్టి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం దేశానికి, మీ సొంత జీవితాలకు చాలా కీలకమని అన్నారు. యువతకు కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో అవగాహన ర్యాలీలు చేపట్టాలి. డ్రగ్స్ సమస్యను అందరం కలిసి ఐక్యంగా ఎదుర్కొందాం. డ్రగ్స్ మహమ్మారి నుంచి మన యువతను కాపాడాలి. తమ శక్తి సామర్థ్యాలను, ఆరోగ్యాన్ని యువతే కాపాడుకోవాలి. బలమైన యువశక్తి వల్లే వికసిత్ భారత్ కల సాకారం. అవుతుంది. మనం ఎల్లప్పుడూ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మన ఇంట్లోని పిల్లలెవరైనా వ్యసనానికి బానిసలైతే, సామాజిక ప్రతిష్ట పేరుతో దానిని దాచవద్దు. అవసరమైన వారి నుంచి సహాయం తీసుకోండి. వైద్య సహాయంతో మీ బిడ్డను వ్యసనం నుంచి విముక్తి చేయడానికి ప్రయత్నించండి" అని ప్రధాని మోదీ తల్లిదండ్రులకు సూచించారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' పేరిట డ్రగ్స్ నిర్మూలనపై దేశవ్యాప్తంగా 100 వారాలపాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని కోటి మంది యువత ప్రతిజ్ఞ చేశారు.

## ఆగస్టు 5న ప్రజల ముందుకు..

మొదటిపేజీ తరువాయి..

ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఆవశ్యకతపై ఆమె సుదీర్ఘంగా మాట్లాడతారని సమాచారం. తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలను కూడా ఆమె వెల్లడించే అవకాశం ఉంది. తాను మళ్లీ స్వదేశానికి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇప్పటికే సంకేతాలు ఇచ్చిన హసీనా, ఢాకాకు తిరిగి వెళ్లే విషయంపై ఈ ప్రెస్ మీట్‌లో పూర్తి స్పష్టత ఇస్తారని భావిస్తున్నారు. పదవి నుంచి తప్పుకున్న తర్వాత ఆమె మీడియాతో నేరుగా ఇంటరాక్ట్ కావడం ఇదే తొలిసారి. ప్రవాసంలో ఉన్న ఆమె స్వయంగా మీడియాతో మాట్లాడనుండటంతో ఈ సమావేశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. హసీనా స్వదేశానికి తిరిగి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. జూన్, జూలై నెలల్లో ఇచ్చిన ఇంటర్వ్యూలలో 2026 డిసెంబర్ నాటికి బంగ్లాదేశ్ వెళ్లాలని ఆమె స్పష్టం చేశారు. అవామీ లీగ్ పార్టీకి రాజకీయంగా మళ్లీ స్థానం కల్పించడం, భవిష్యత్ రాజకీయాల్లో పాల్గొనడం లక్ష్యంగా ఆమె స్వచ్ఛందంగా బంగ్లాదేశ్ వెళ్లనున్నారు. పార్టీపై విధించిన నిషేధాన్ని సవాలు చేసేందుకు సీనియర్ నేతలతో కలిసి డిసెంబర్‌లో అక్కడికి చేరుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు. తనపై నమోదు చేసిన కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలే అని ఆమె కొట్టిపారేశారు. అక్కడికి వెళ్లిన తర్వాత అరెస్టుకైనా, ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని హసీనా తేల్చిచెప్పారు. అయితే హసీనా బంగ్లాదేశ్ వెళ్లడానికి అనేక అడ్డంకులు ఉన్నాయి. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. బంగ్లాదేశ్ కోర్టు ఆమె లేని సమయంలోనే మరణశిక్ష విధించింది. ప్రస్తుత ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీని పూర్తిగా నిషేధించింది. ఈ పరిస్థితుల్లో ఆమె స్వదేశంలో అడుగుపెడితే తీవ్రమైన భద్రతా సమస్యలు తలెత్తుతాయి. అలాగే ప్రభుత్వంతో పెద్ద ఎత్తున న్యాయపరమైన పోరాటం చేయాల్సి ఉంటుంది.

## జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు

మొదటిపేజీ తరువాయి..

సంకల్ప్ అభియాన్'ను గోయెల్ ప్రశంసించారు. దేశ యువత ఉత్సాహం భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మారుస్తుందని ఆయన అన్నారు."జెన్ జీ ఎల్లప్పుడూ మాతోనే ఉన్నారు. జెన్ జీ మద్దతు, యువత శక్తి లేకుండా ప్రధాని మూడుసార్లు గెలిచి ఉండేవారు కాదు. సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీతో నిలబడుతుందనే పూర్తి విశ్వాసంతో మేము ఉన్నాం. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చాలనే మన యువత ఉత్సాహం వికసిత్ భారత్‌కు పునాది వేస్తుంది. ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా యువతీ యువకులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగే ఈ సామూహిక పోరాటంలో చేరతారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని పీయూశ్ గోయెల్ అన్నారు. మరోవైపు ప్రధాని మోదీకి యువతలో పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భయపడుతున్నారు అని గోయెల్ అన్నారు. రాహుల్ గాంధీ గతంలో తనకు తానే యువ నాయకుడిగా చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు ఆ స్థాయి ఆదరణ ఆయనకు లేదు అని ఎద్దేవా చేశారు. యువ ఓటర్ల మద్దతు ఎప్పుడూ బీజేపీకే ఉంటుందని అన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు వారు జై



కొడుతున్నారని పేర్కొన్నారు. 1997 నుంచి 2012 మధ్య జన్మించిన యువతను జెన్ జీ ఉంటారు. ప్రధాని మోదీ ఈ రోజు 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రారంభించి, 28 వేలకుపైగా ప్రాంతాల్లోని కోటి మందికి పైగా యువతతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడారు.

తాము ప్రారంభించిన ఈ కార్యక్రమం వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు, కుటుంబాలు, సమాజం, యావత్ దేశ విస్తృత ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం మాదకద్రవ్య రహిత సమాజం ఉండాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ముఖ్యంగా యువత శారీరకంగా ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల వంటి వినాశకరమైన అలవాట్లకు శాశ్వతంగా దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చేపట్టిన మాదక ద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని చెప్పారు. "ఓ యువకుడు డ్రగ్స్ మహమ్మారి బారినపడితే, అప్పుడు ఆ యువకుడే మాత్రమే కాదు ఓ కల కూడా ఓడిపోతుంది. ఓ కల అంతరించిపోతుంది. ఓ కుటుంబం ఓడిపోతుంది. కుటుంబమంతా నాశనం అవుతుంది. సమాజం కూడా అసహ్యించుకుంటుంది. మత్తు కేవలం శరీరానికి మాత్రమే నష్టం చేయదు. మత్తు ఓ తల్లి నవ్వును కూడా లాగేసుకుంటుంది" అని మోదీ అన్నారు.

# పాకిస్థాన్‌లో నరమేథం

మొదటిపేజీ తరువాయి..

ఇతర భద్రత సిబ్బంది ఆ ప్రాంతంలో తనిఖీలు కొనసాగిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్న ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలని కోరుతూ స్థానిక గిరిజన సంఘం స్వాత్ అమన్ జిర్గా ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్నవారు శాంతి నెలకొల్పాలని నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. ఆత్మాహుతి దాడిలో ప్రాణాలు కోల్పోయినవారిలో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారని అధికారులు తెలిపారు. సమీపంలోనే ఒక బహిరంగ సభ ముగుస్తున్న సమయంలో పోలీస్ స్టేషన్ గేటు దగ్గర పేలుడు సంభవించింది' అని స్వాత్ జిల్లా పోలీస్ అధికారి ముహమ్మద్ ఉమర్ చెప్పారు. 'ఆత్మాహుతిదారుడు పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా, ప్రధాన గేటు వద్ద ఒక పోలీసు అతడిని అడ్డగించాడని, దీంతో అతడు తన వద్ద ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకున్నాడు' ఆయన తెలిపారు. గత కొన్ని నెలలుగా వాయువ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాలో భద్రతా పరిస్థితులు దారుణంగా దిగజారాయి. తెహ్రీకే-తాలిబాన్ పాకిస్థాన్ తదితర ఉగ్రవాద సమూహాలు ఈ ప్రాంతాల్లోని భద్రతా బలగాలు, చెక్‌పోస్టులు, పోలీస్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయి. గత నెల ట్యాంక్ జిల్లాలోని సంయుక్త భద్రతా చెక్‌పోస్ట్‌ను పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో ఢీకొట్టి సైనిక బలగాలు సహా 15 మంది ప్రాణాలను బలిగొన్నారు. లోయర్ సౌత్ వజీరిస్థాన్, బజౌర్ వంటి సరిహద్దు ప్రాంతాలలో ఐఈడీ పేలుళ్లు, డ్రోన్ దాడులతో సాధారణ పౌరులు, చిన్నారులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. అఫ్గనిస్థాన్ సరిహద్దుల్లోని ఈ ప్రావిన్సుల్లో రోజు రోజుకూ భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్నాయి. అఫ్గన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీటీపీ ఉగ్రవాద సంస్థ పాకిస్థాన్‌లో దాడులను మరింత తీవ్రతరం చేసింది. అఫ్గన్ భూభాగం నుంచే ఈ ఉగ్రమూకలు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తున్నాయని పాకిస్థాన్ నిరంతరం ఆరోపిస్తోంది. ఈ క్రమంలో అఫ్గన్‌పై ఇటీవల పలుసార్లు వైమానిక దాడులకు పాల్పడింది.



## గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసరలో రోడ్ల నిర్మాణానికి 27 కోట్ల నిధులు

**– ఎమ్మెల్యే రామరావ్ పటేల్**



**బాసర ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర లో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం 27 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ తెలియజేశారు.. ఆదివారం భైంసా లోని తన నివాసం లో ఈ విషయాన్ని వెల్లడించారు...పంచాయత్ రాజ్ ద్వారా ఓని నుండి బాసర వరకు రోడు మరమ్మత్తులకు 2 కోట్ల 55 లక్షలు, గన్నోరా నుండి ఓని వరకు 2 కోట్లు, పి. డబ్ల్యూ. డి. రోడ్ నుండి బాసర లో మహంకాళి టెంపుల్ రోడ్ కు 1 కోటీ 20 లక్షలు, కిర్గుల్ బి నుండి బాసర వరకు రోడ్ కనెక్టివిటికీ 2 కోట్ల 80 లక్షలు, బాసర రైల్వేస్టేషన్ నుండి నావేగావ్ రోడ్ వరకు 1 కోటీ 35 లక్షల నిధులు, మల్కాపూర్ మీదుగా బాసర వరకు 2 కోట్ల 70 లక్షలు ట్రిపుల్ ఐటి నుండి బాలాపూర్ రోడ్ కు 45 లక్షలు, పెట్రోల్ బంక్ నుండి శాంఖరి స్కూల్ వరకు 45 లక్షలు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో బాసర అబాది నాలుగు లేన్ల రోడ్ పుష్కరా ఘాట్ వరకు 8కోట్ల 50 లక్షలు,బిద్రేల్లి నుండి ధర్మబాద్ కు 2 లైన్స్ రోడ్ కు 4కోట్ల 65 లక్షల రూపాయల నిధులు, బాసర బస్ స్టాండ్ రహదారి మరమ్మత్తుల కు 85 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2027 లో గోదావరి పుష్కరాల సందర్భంగా ఈ పనులను వేగవంతం చేయనున్నట్లు చెప్పారు.

## 9న యువ సమ్మేళనం గోడ ప్రజల ఆవిష్కరణ

**రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఖానాపూర్ శాఖ వెల్లడి**





**ఖానాపూర్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖానాపూర్ పట్టణంలో హిందూ యువ సమ్మేళనం కార్యక్రమం తలపెట్టింది ఈ సందర్భంగా ఖానాపూర్ పి ఆర్ టి యూ భవన్ లో హిందూ సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ నెల ఆగస్టు 9 తేదీన ఆదివారం సి ఎమ్ రావ్ గార్డెన్ లో యువ హిందూ సమ్మేళనశీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ యువ సమ్మేళనం సమితి నాయకులు అడిదెల శరత్,కట్కం మణి చరణ్,బక్కశెట్టి కార్తీక్,బక్కశెట్టి రవి, అన్నారు. కార్యక్రమం లో భాగంగా హిందూ యువ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనశీ సమితి నాయకులు మాట్లాడుతూ ఎక్కువ శాతం యువకులు ఉన్న దేశం మన భారత దేశం అని దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని అన్నరు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా కదిలి ఒక హిందువుగా కదలి వచ్చి ఈ యువ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఖండ కార్యవాహ తుమ్మన్న పల్లి సంకేత్ వర్ధన్, ధర్మ జాగరణ జిల్లా సంయోజక్ పడాల ప్రభాకర్,సద్భావన టోలీ నాయకులు కొండాడి గంగారావు, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంత్ర రాజం సురేష్,భజరంగ్ దళ్ జిల్లా నాయకులు కాశవేణి ప్రణయ్, ఖానాపూర్ భజరంగ్ దళ్ నాయకులు రాజశేఖర్, హిందూ వాహిని నాయకులు కుంచపు తరుణ్, వివిధ గ్రామాల హిందూ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ లేబర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దల్లా చంద్రకాంత్ నియామకం

**– కార్మికుల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలి**
**– రాష్ట్ర అధ్యక్షుడుకుతాడి శివరాజ్ సూచన**






**మంచిర్యాల, 2, ఆగస్టు (ప్రజా జ్యోతి) :** తెలంగాణ జనతా పార్టీ అను బంధ తెలంగాణ లేబర్ యూనియన్ (టి.ఎల్.యు) మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దల్లా చంద్రకాంత్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ లేబర్ యూనియన్‌ను మరింత బలో పేతం చేయడం, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సంఘ నిర్మాణాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే అసంఘటిత రంగ కార్మికులను పెద్ద ఎత్తున తెలంగాణ లేబర్ యూనియన్‌లో చేర్పించి, సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దల్లా చంద్రకాంత్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్‌తో పాటు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తూ, మంచిర్యాల జిల్లాలో తెలంగాణ లేబర్ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**– 55వ వార్షికోత్సవ జాతరలో ప్రత్యేక పూజలు..**
**– సకుటుంబ సమేతంగా పాల్గొన్న నడిపెల్లి విజిత్ కుమార్**







**మంచిర్యాల, 2, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** హాజీపూర్ మండలంలోని గడ్‌పూర్ శివారులోని ఏసీసీ క్వారీ గుట్టల్లో కొలువుదీరిన శ్రీ దుర్గామాత అమ్మవారి 55వ వార్షికోత్సవ జాతర సందర్భంగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి దివాకర్ రావు సకుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ కూడా జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టిబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుని పూజిస్తేనె సర్వ దోషాలు తొలగిపోతాయి

**పంచముఖ ఆంజనేయ ఆలయ మాసోత్సవంలో చండీ ఉపాసకులు విష్ణుభట్ల కీర్తి రాఘవ శర్మ వెల్లడి**







**ఖానాపూర్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** మానవాళిలో శారీరక రుగ్మతలతో పాటు తో పాటు సర్వ దోషాలు హనుమంతుని పూజిస్తేనే తొలగిపోతాయని చండీ ఉపాసకులు విష్ణుభట్ల కీర్తి రాఘవ శర్మ (మున్న పంతులు) అన్నారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పవిత్ర ఉత్తరవాహిని పట్టణంలోని కొమరం భీమ్ చౌరస్తాలో గల సంకట మోచన కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో 9వ మాస ఉత్సవం సందర్భంగా ఆంజనేయ స్వామి పూర్వభద్ర నక్షత్రం సందర్భంగా మూల మంత్ర హోమ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించి నా సందర్భంగా ప్రతి నెల కుమారు మాస ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది ఆదివారం ఆలయంలో అర్చకులు తిరునగరి నంద కిషోరాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజ 9 గంటల 30 నిమిషాలకు స్వామివారికి పంచామృత అభిషేకము విశేష అష్టోత్తర శతనామ అర్చన హనుమాన్ చాలీసా పారాయణం హారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వేద పండితులు రాఘవ శర్మ మున్నపంతులు ఆధ్వర్యంలో హోమ కార్యక్రమం నిర్వహించగా ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాడి రమ వెంకటేశ్వర్లు ఎడ్ల రాజేశ్వర్ లక్ష్మి తుమ్మనపల్లి సుజాత లక్ష్మణ్ గట్టు రాజేశ్వర్ లహరి మంత్రరాజం గోదాదేవి అల్వార్ చార్యులు సీనియర్ పాత్రికేయులు మంత్రరాజం అన్నపూర్ణ దేవేందర్ అర్చకులు కృష్ణవేణి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు సంవత్సరం పాటు నెలవారీగా జరిగే హోమాల వల్ల గ్రామ సంరక్షణతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని వేద పండితులు అన్నారు అన్నదాన కార్యక్రమం సీనియర్ జర్నలిస్ట్ మంత్ర రాజ్యం అన్నపూర్ణ దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఉపాధ్యక్షులు తోట హనుమంతు సింగ్ ప్రవీణ్ కుమార్ సింగు లక్ష్మీనారాయణ హిందూ విశ్వ కమిటీ మాజీ అధ్యక్షులు రాచమల్ల రాజశేఖర్ తదితరులు పాల్గొని వితరణ చేశారు ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారు తీర్థ ప్రసాదాలతో పాటు దివ్య ఆశీస్సులు పొంది అన్న ప్రసాదం స్వీకరించారు.

## బాసరలో ఘనంగా ఊర పండగ ప్రారంభం







**బాసర ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో ఆదివారం శ్రీ మహాలక్ష్మి,పెద్ద పోచమ్మ,, సూదులమ్మ,మారెమ్మ గ్రామ దేవతల ఆలయంలో సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నూకం లింగారావు,మహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు బాల మల్కన్న యాదవ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బండార,ఊర పండగను ఘనంగా ప్రారంభించారు.

మంగళ వాయిద్యాలతో డప్పు చప్పులతో పోతురాజులు గ్రామ దేవతలకు అభిషేకం, అర్చన,పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను గ్రామస్తులకు అందజేశారు. ఈ రోజు నుండి ఈ నెల 9వ తేదీ వరకు గ్రామంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతి యువకులు అందరూ కలిసికట్టుగా ఈ ఊర పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,విడిసి అధ్యక్షుడు నూకం లింగారావు తెలిపారు. మొదటి రోజు అమ్మవార్లకు గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు,బోనాలు నైవేద్యాలు సమర్పించి తమ మొక్కలను చెల్లించుకున్నారు. ప్రజల ఆయురారోగ్యాలతో పాటు పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

## స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం



**మంచిర్యాల, 2, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్నేహబంధం గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, స్నేహం అనేది స్వార్థం లేని అనుబంధం అని, పరస్పర గౌరవం, నమ్మకం, సహకారం ఉన్న చోటే నిజమైన స్నేహం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మంచి స్నేహితులుగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. నిజమైన స్నేహం కాలంతో మారదని, స్నేహానికి భాషా, సరిహద్దుల భేదాలు ఉండవని, హృదయపూర్వకమైన నమ్మకం, పరస్పర గౌరవమే స్నేహానికి బలమైన పునాదులని అన్నారు. జీవితంలో అనుకోకుండా ఏర్పడే స్నేహబంధాలు కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలుస్తాయని, స్వార్థం లేని స్నేహం ఎలాంటి సంక్షోభాలనైనా అధిగమించగలదని తెలిపారు. రక్త సంబంధం లేకపోయినా ప్రాణస్నేహితులుగా ఒకరికొకరు తోడుగా ఉండాలని, అసలైన స్నేహితుడు చెడు మార్గం నుంచి మంచి మార్గంలో నడిపించే వ్యక్తి అని అన్నారు. అనంతరం సింగరేణి విశ్రాంత ఉద్యోగులందరికీ, ఇతర మిత్రులకు, శ్రేయోభిలాషులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులందరూ పరస్పరం ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకొని స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.

## వైద్యులే నిజమైన స్నేహితులు.. ప్రపంచ స్నేహితుల దినోత్సవం

**ఆళవందార్ వేణు మాధవ్ ప్రశంసలు**



**మంచిర్యాల, 2, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** ప్రపంచంలోని అన్ని బంధాల కంటే స్నేహబంధమే గొప్పదని, వృద్ధాప్యంలో ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రాణాలను నిలబెట్టే వైద్యులు, వైద్య సిబ్బందే నిజమైన స్నేహితులని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని చౌదరిగూడ ఓయూ కాలనీలో ఉన్న సురవి హాస్పిటల్‌లో డాక్టర్ కె.ప్రవీణ్కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాధవ్ మాట్లాడుతూ, ఆస్తులు, అంతస్తులు, హోదా, ధనం కంటే స్నేహానికి ఎంతో విలువ ఉందన్నారు. మహా భారతంలో శ్రీకృష్ణుడు-కుచేలుడు స్నేహం, దుర్యోధనుడు-కర్ణుడు మైత్రి స్నేహబంధం గొప్పతనాన్ని చాటిచెప్పాయని అన్నారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలను అధిగమించడంలో వైద్యులు, నర్సులు, ఫిజియోథెరపిస్టులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కంచె బీరయ్య, ఎం.డి. రఫిక్, ఏ. ప్రభాకర్, వైద్య సిబ్బంది శ్రావణి, ఫిజియోథెరపిస్టులు మునీరా ఖుదుసా, సంధ్య, శివాని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన భారీ గుంత.. వాహనదారుల ఆందోళన

- ఖమాన్-వాంకిడి ప్రధాన రహదారిపై ప్రమాదకర గుంత
- వర్షపు నీటితో లోతు తెలియని పరిస్థితి.. వెంటనే పూడ్చాలని డిమాండ్





**ఆసిఫాబాద్ ఆగస్టు 2 ప్రజా జ్యోతి :**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి నుంచి ఖమన కకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంత ఎందుకు తవ్వారు? ఎవరి కోసం తవ్వారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలో నీరు నిలిచిపోవడంతో దాని లోతు ఎంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే పలువురు వాహనదారులు గుంతను తప్పించుకునే క్రమంలో ప్రమాదాల నుంచి తృటిలో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. వర్షపు నీటితో గుంత కనిపించకపోవడంతో ప్రమాదం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

**వెంటనే చర్యలు తీసుకోవాలి :** ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ గుంతను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టి పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా ముందస్తు చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలను నివారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కందకం బ్రిడ్జి వద్ద నిలిచిన చెత్తను తొలగించిన ఆడే గజేందర్




**నేరడిగొండ, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి) :** మండలంలోని వడూర్ గ్రామంలో ఉన్న కందకం బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీటితో పాటు భారీగా చెట్లు, చెత్తాచెదారం కొట్టుకొచ్చి నిలిచిపోయాయి. దీనివల్ల వంతెన గుండా ప్రయాణించే వాహనదారులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ సమస్యను గుర్తించిన బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తక్షణమే స్పందించారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకూడదని, బ్రిడ్జి దెబ్బతినకుండా ఉండాలనే ముందస్తు జాగ్రత్తతో ఆదివారం తన ఆధ్వర్యంలో జెసిబీ సహాయంతో కూరుకుపోయిన చెత్తను, చెట్లను పూర్తిగా తొలగింపజేశారు. రోడ్డును రాకపోకలకు అనుకూలంగా మార్చడంతో స్థానిక రైతులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

## తొలి బోనాలకు పోటెత్తిన జనాలు

**తొలి బోనాల పండుగ సందర్భంగా భక్తులతో కిటికీలాడిన బంగల్పేట మహాలక్ష్మి అమ్మవారి ఆలయం**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగష్టు 2, (ప్రజాజ్యోతి) :** తొలి బోనాల పండుగ సందర్భంగా నిర్మల్ పట్టణంలోని బంగల్పేట శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటా లాడింది ఉదయం నుంచి మహిళలు పురుషులు చిన్నారులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు ఆలయంలో వేదమంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు మహా మంగళహారతి నిర్వహించారు భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి దర్శనాలను సజావుగా నిర్వహించారు అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. బోనాలు తొలి ఆదివారం కావడంతో మహా లక్ష్మీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.



## దుర్గామాత కరుణాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలి

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, 2, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ క్వారీలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గామాత అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ ముఖేష్ గౌడ్, బీజేపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సకుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, దుర్గామాత కరుణాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో జీవించాలని, రైతులు సమృద్ధిగా పంటలు పండించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని, సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ఆమె ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు బీజేపీ నాయకులకు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# పొలం బాట పట్టిన ఎమ్మెల్యే..!

- ఆయిల్‌పామ్ సాగుపై సమీక్ష..
- ఆవులకు స్వయంగా అరటిపండ్లు తినిపించిన ఎమ్మెల్యే
- తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో తీరికలేని షెడ్యూల్ మధ్య కూడా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వ్యవసాయం, పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆదివారం తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న సాగు పనులను పరిశీలించారు. ఆధునిక వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టనున్న పొలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. భూసార పరిస్థితులు, సాగుకు అనుకూలత, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. అధిక దిగుబడులు వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలోని ఆవుల వద్దకు వెళ్లిన





ఎమ్మెల్యే వాటికి స్వయంగా అరటిపండ్లు తినిపించారు. పశువుల ఆరోగ్య పరిస్థితి, పోషకాహారం, సంరక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పశువులకు సమయానికి మేత, పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ క్షేత్రంలో చేపట్టే ప్రతి పనిని పర్యవేక్షిస్తూ, పశుసంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూనే వ్యవసాయం, పశుపోషణకు సమయం కేటాయించడం విశేషంగా నిలిచింది.

# నిజాయితీ గల సేవలకు సమాజంలో శాశ్వత గౌరవం

- డీఈఈ కబీర్దాసు పదవీ విరమణ సన్మానంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ సహజమైనదేనని, అయితే ఉద్యోగ జీవితంలో నిజాయితీతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన వారిని సమాజం ఎప్పటికీ గౌరవిస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన నేనావత్ కబీర్దాసు సన్మాన కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కబీర్దాసు, ఆయన



సతీమణిని శాలువాతో ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో సంపాదించిన అనుభవం, పరిజ్ఞానం, సామాజిక బాధ్యతను ప్రజల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. ఉద్యోగ విరమణతో సేవలు ముగిసిపోవని, అది కొత్త జీవితానికి ఆరంభమని పేర్కొన్నారు. మిగిలిన జీవితాన్ని ప్రజాసేవకు, సమాజాభివృద్ధికి అంకితం చేస్తేనే ఉద్యోగ జీవితానికి సార్థకత చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వరదను ఆస్వాదించండి.. ప్రమాదాన్ని ఆహ్వానించొద్దు

- సెల్ఫీల మోజు వద్దు.. పోలీసుల హెచ్చరిక
- జూరాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి): జూరాల ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తివేయడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను తిలకించేందుకు ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ సునితారెడ్డి ఆదేశాల మేరకు అమరచింత ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు, నీటి ప్రవాహానికి సమీపంలోకి వెళ్లే వారిని అడ్డుకుని అప్రమత్తం చేశారు. సురక్షిత దూరం నుంచే





వరదను వీక్షించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై స్వాతి మాట్లాడుతూ.. వరద ప్రవాహాన్ని దగ్గరగా చూసేందుకు, సెల్ఫీలు, వీడియోల కోసం నీటి అంచుల వరకు వెళ్లడం ప్రాణాపాయమని హెచ్చరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటవద్దని, విధుల్లో ఉన్న పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నారులను నీటి ప్రాంతాల వద్దకు ఒంటరిగా వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై స్వాతి కోరారు.

# భవాసర్ సమాజ్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు పండుగ

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలో భవాసర్ సమాజ్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో





గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ,ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శ్రీ భవాని మాత నల్లజానమ్మ దేవాలయంలో ఈ పండుగ నిర్వహిస్తామని ప్రెసిడెంట్ మహేంద్ర కార్ విజయలక్ష్మి తెలిపారు. ఆషాఢ మాసంలో జరుపుకునే మెహిందీ పండుగ (గోరింటాకు వేడుక) స్త్రీల సంప్రదాయంలో ఎంతో ప్రత్యేకమైనది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ఆషాఢ శుక్రవారాలు, బోనాల సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో గోరింటాకు పెట్టుకుంటారు. గోరింటాకు శుభానికి,మంగళానికి ప్రతీకగా భావిస్తారు. అమ్మవారి ఆశీస్సులు, కుటుంబ సుఖశాంతి, ఐశ్వర్యం,ఆరోగ్యం కలగాలని మహిళలు ప్రార్థిస్తూ మెహిందీ ధరించుకుంటారు. వివాహిత మహిళలు తమ భర్త దీర్ఘాయుష్షు కోసం, అవివాహిత యువతులు మంచి వరుడు లభించాలని కోరుతూ గోరింటాకు పెట్టుకుంటారు. ఆషాఢంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం మెహిందీ పెట్టుకోవడం ఒక సాంప్రదాయ ఆచారం. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించి, వర్షాకాలంలో చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని ఆయుర్వేదం చెబుతుంది. కుటుంబ సభ్యులు బంధుమిత్రులు కలిసి ఆనందంగా జరుపుకునే ఈ వేడుక ఐక్యతకు,సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక "ఆషాఢ మాసంలో అమ్మవారి అనుగ్రహంతో గోరింటాకు సోయగాలు విరబూసి, ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని మనసారా కోరుకుందాం. అందరికీ ఆషాఢ గోరింటాకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ నౌలే రంజన వైస్ ప్రెసిడెంట్ నీమ్కర్ మాధురి సెక్రెటరీ నౌలే అనసూయ కోశాధికారి బోడి కే సరిత,పట్కే లక్ష్మి బాయి రంగ్దల్ గాయత్రి దగే విజయలక్ష్మి బాసూద్కర్ విజయలక్ష్మి బోడికే రేఖ,బోడికే వీణ,దగే విజయ లక్ష్మి, మహేంద్ర కార్, గాయత్రి,అనిత,కృష్ణ వేణి,శోభ,సంధ్య, లక్ష్మి ప్రియా,నవ్య,అరుంధతి పాల్గొన్నారు.

# అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు

నాగర్ కర్నూల్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్ లతో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది భారత్ వ్యవసాయ రంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తూ... జీరో సంఘంతో దిగుమతులు చేయడానికి పరిస్థితి ఉందని వెంటనే ఈ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్థం పర్వతాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజు అచ్చంపేట పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఉన్న పివి రావు భవనంలో జరిగిన సిపిఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి వి పర్వతాలు మాట్లాడారు. గత డిసెంబర్లో పత్తిపై ఉన్న 11% సుంకం తగ్గించి 40 లక్షల వేళ్ళ పత్తిని అదనంగా దిగుమతి చేసుకోవడంతో దేశంలో పత్తి ధరలు పడిపోయి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే పని కేంద్ర ప్రభుత్వం చేయడం దుర్మార్గమని వారు అన్నారు. భారత దేశంలో ఏటా 18 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తుండగా కనీసం మద్దతు ధర అమలు జరగకపోవడం వల్ల రైతులు ఏట నాలుగు లక్షల కోట్ల నష్టపోతున్నారని ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాబీ ప్రకటించారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పై 50% కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం ఉత్పత్తి ధరలను తగ్గించి నిర్ణయించడం వల్ల గిట్టుబాటు ధర రావడంలేదని అన్నారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రము నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని రుణ విమోచన చట్టం చేయాలని...కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు పంట రుణాల సౌకర్యం ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం భీమ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ఎక్కడికి ఎక్కడెక్కడ ఉద్యమ పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్దేశానాయక్ జిల్లా కమిటీ సభ్యులు శంకర్ నాయక్ మల్లేష్ నిర్మల మండల కార్యదర్శి వర్గం సైదులు





మండల నాయకులు గుండె మల్లేష్ బి రాములు శివకుమార్ రజిత సరిత శివ లీల వెంకటయ్య స్వరూప మల్లేష్ ఏమయ్యా రాములు తదితరులు ఉన్నారు.

# స్నేహం విలువ... వేల కట్టలేనిది

- వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ చందు నాయక్
- ఘనంగా స్నేహితుల దినోత్సవం

నాగర్ కర్నూల్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) సమాజంలో అన్ని బంధాల కన్నా... స్నేహబంధం మిన్న స్నేహ బంధాన్ని వేల కట్టలేమని వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ చందు నాయక్ స్పష్టం చేశారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అచ్చంపేట స్టేడియంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం మార్నింగ్ వాక్ అనంతరం సభ్యులు స్నేహబంధానికి ప్రతీకగా ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం డ్యాన్సులు, నృత్యాలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకుంటూ స్నేహితుల దినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ చందునాయక్ మాట్లాడుతూ, ప్రతి రోజు ఉదయం కలిసి నడవడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆప్యాయత, అనుబంధం, స్నేహం మరింత బలపడుతుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుల మధ్య ఏర్పడిన అనుబంధం ఒక కుటుంబ బంధంగా మారిందని, జీవితంలో ఇలాంటి ఆనంద క్షణాలు అరుదుగా లభిస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు బషీర్ తన కవితలతో ఆకట్టుకోగా, చందునాయక్ రచించిన స్నేహ కవితకు సభ్యుల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం స్టేడియం నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి స్నేహితుల దినోత్సవం సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పారు. ర్యాలీకి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సభ్యులను అభినందించారు.



ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, కోశాధికారి పోల శ్రీనివాసులు, రూపుల నాయక్, బషీర్, సాయిరాం, పూర్వ అధ్యక్షులు భగీరనాథ్, భాస్కర్, స్వామి, నర్సోజి, నిరంజన్, రాములు, జమీర్, ఖాదర్, ప్రకాష్, శ్రీకాంత్, బిచ్చ నాయక్, రిటైర్డ్ ఎమ్మార్వో ఇక్బాల్, మాధవాచారి, శివరామకృష్ణ, ఖదీర్, హరి, సాదిక్, నిరంజన్.ప్రియాంక, నగేష్, శ్రీనివాసులు, సామ్య, రాందాసు, పరమేశ్వర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 37 ఏళ్ల నిజాయితీ సేవలకు ఘన సన్మానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ నగరంలోని ఎ ఎస్ఎన్ గార్డెన్, శేషాద్రి నగర్‌లో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఎం. విజయ బాబు ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విజయబాబును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, విజయ బాబు కండక్టర్‌గా 37 సంవత్సరాల పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అత్యంత నిబద్ధతతో, నిజాయితీతో విధులు నిర్వర్తించి ప్రయాణికుల అభిమానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రజాసేవ పట్ల ఆయన చూపిన అంకితభావం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా విజయ బాబు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్ చారి, శ్రీనివాసులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.




# విశ్వహిందు పరిషత్ అద్వర్యంలోనేడు దీరజ్ చిన్నస్వామిరాక



అడ్డాకుల. అగస్ట్ 2(ప్రజా జ్యోతి) అడ్డాకుల మండల కేంద్రానికి స్థానిక శ్రీ శ్రీ శివాంజనేయ స్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి వారోత్సవాల్లో భాగంగా సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చిన్నదియర్ స్వామి రానున్నట్లు రాచాలా జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు సోమవారం ఉదయం 9 గంటలకు గురు పూజా కార్యక్రమం అనంతరం స్వామివారి ప్రసంగ కార్యక్రమం మన హిందూ ధర్మం గురించి ప్రసంగించనున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమానికి పరిషత్ నిర్వాహకులు జ్యోతి రానున్నట్లు వారు తెలియజేశారు కార్యక్రమానికి అడ్డాకుల గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.

## ఘనంగా మహిళా స్నేహితుల దినోత్సవం

-స్నేహితులుంటేనే ఆరోగ్యం,ఐశ్వర్యం ప్రాప్తి

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 02 (ప్రజా జ్యోతి) జై గౌడ జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆ ది వారం జై గౌడ మహిళా జిల్లా అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ నేటి కాలంలో స్నేహితులు తక్కువ సంఖ్యలో ఉంటున్నారని పూ ర్వకాలంలో కనీసం వందమంది మిత్రులుండే వా రని,ఆ సంఖ్య నేడు పదులకు చేరిందని అన్నారు. అనంతరం స్నేహితులతో మెహంది కార్యక్రమాన్ని జరిపి ఏ సందర్భానికైనా స్నేహితులుంటేనే కార్యం ముందుకు వెళుతుందని, స్నేహితుల సహకారం, తోడ్పాటు ప్రతి ఒక్కరికి అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో జ్యోతి,నిర్మల,దివ్యా,కవిత,స్రవంతి, హేమలత, పద్మ, జయశ్రీ,సరస్వతి,శోభ,లక్ష్మి,గీత, గౌడ బంధువులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం నిత్యావసరాలు పంపిణీ

**ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్**



**రాయపర్తి ఆగస్టు 2 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొలనుపెల్లి 'గ్రామంలోచిట్యాల జగదంబ అరురి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి ఉదయాకరావు ఆదేశాల మేరకు పరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబనికి 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ల ను సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామిస్థానిక నాయకులు అయిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు వంగల నరసయ్య పార్టీ ముఖ్య నాయకులు చిట్యాల వెంకన్న, తోట నరసింగం, తోట నందు, మాచర్ల సోమ నారాయణ, చిట్యాల సోమయ్య, సత్తూరి వెంకన్న, తోట క్రిష్ణమూర్తి, రాజులి తదితరులు పాల్గొన్నారు.

## కొండాపురం గ్రామంలో రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్లు

**పట్టించుకోని విద్యుత్తు అధికారులు**



**రాయపర్తి ఆగస్టు 2 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో ఆదివారం ప్రధాన రహదారిపై వైర్లు తెగిపడడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనుకుంట్ల మంజుల అశోక్ విషయాన్ని విద్యుత్ శాఖ ఎ ఎల్ ఎం భీమ్లా నాయక్ కు టెలిఫోన్ ద్వారా పలుమార్లు సమాచారం అందించి నప్పటికీ స్పందించలేదని తెలిపారు. రహదారిపై విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడంతో రహదారి వెంట నడిచే ప్రజలకు, చిన్నారులకు పశువులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం వాటిలితే ఎవరూ దీనికి బాధ్యత వహిస్తారని ఆయన అన్నారు. పాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వైర్లను సరిచేసి మరమ్మతులు చేపట్టి రహదారిపై పడి ఉన్న వైర్లను సరిచేసి ప్రమాదం జరగకుండా నివారించాలని ఆయన కోరారు.

## ఉచిత కంటి పరీక్షలను ప్రారంభించిన సర్పంచ్ వినోద్ కుమార్

**– సరోజినీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు**



**బచ్చన్నపేట అగస్టు 2(ప్రజాజ్యోతి) :** బచ్చన్నపేట మండలం,రామచంద్రపురం గ్రామ సర్పంచ్ బొందుగుల వినోద్ కుమార్ రెడ్డి మరియు ఉపసర్పంచ్,వార్డు సభ్యుల సహకారంతో సరోజినీ కంటి హాస్పిటల్ జనగామ వారి ఆధ్వర్యంలో అదివారంరోజునా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ క్యాంప్‌లో 100 మందికి పైగా పాల్గొన్నరు. వారందరికీ మందుల పంపిణీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మరియు సరోజినీ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్యాంప్ నిర్వహించిన హాస్పిటల్ యాజమాన్యానికి గ్రామ సర్పంచ్ ధన్యవాదములు తెలిపారు ఇలాంటి క్యాంప్ లు మరిన్ని చేపట్టాలని వారు కోరారు.

## ఘనంగా ఎస్ఎస్‌సి 1993--94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**కొడకండ్ల, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుని బాల్య స్మృతులను హృదయ పూర్వకంగా నెమరువేసుకున్నారు. కొడకండ్లలోని వారి సహా విద్యార్థి మసురం లక్ష్మి నర్సింహా స్వామి కి చెందిన శ్రీరామ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు చూసుకుంటూ ఆనందంతో ఆలింగనం చేసుకుని, భావోద్వేగానికి లోనయ్యారు. అక్కడి నుంచి ర్యాలీగా కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని, పాఠశాల బోర్డు ముందు గ్రూప్ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ తమ బాల్యాన్ని మరోసారి కెమెరాల్లో బంధించుకున్నారు. తాము చదివిన తరగతి గదుల్లోకి అడుగుపెట్టి, అప్పట్లో ఉన్న తరగతి గదుల గుర్తులను చూసి ఆనాటి రోజులు కళ్లముందు కదలాడాయని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రార్థనా వేదిక వద్ద నిలబడి ఫోటోలు దిగారు. పాత నిర్మాణాల్లో కొన్ని లేకపోవడాన్ని చూసి బాధ వ్యక్తం చేసినప్పటికీ, పాఠశాల అభివృద్ధి చెందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పాత తరగతి గదులను శాశ్వతంగా పరిరక్షించాలని కోరారు. ఒకప్పుడు విరామ సమయంలో కలిసి ఆడిన ఆటలు మరోసారి ఆడుతూ ఆటల్లో పాల్గొని సందడి చేశారు. పాటలు పాడుతూ, ఆ పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహభరితంగా గడిపారు. అన్నదమ్ముల్లా పరస్పరం పలకరించుకుంటూ తమ అనుబంధాన్ని మరింత బలపరుచుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు నిర్వహించి, ఆటలు, పాటల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, హాజరైన ప్రతి సహ విద్యార్థులను స్థానిక చేనేత కార్మికులు నేసిన తువ్వాళ్లతో ఘనంగా సన్మానించారు. జీవితంలో ఎన్నో విజయాలు సాధించినా పాఠశాల స్నేహితులతో గడిపిన ఆ క్షణాలకు సాటి మరొకటి లేదని కాలం మమ్మల్ని దూరం చేసినా ఈ రోజు మళ్లీ మనసులను ఒక్కటిగా చేసిందని పేర్కొన్నారు.

# గుంతల బాట...సంగెం బాట..!

- గుంతల్లో పడి బైకిస్టులకు తీవ్ర గాయాలు
- మండల కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఎలా..?
- ప్రజాప్రతినిధులు,అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించాలి





**సంగెం, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** సంగెం మండల కేంద్రంలోని అత్యంత కీలకమైన అంబేద్కర్ సెంటర్ వద్ద మెయిన్ రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలమయంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

**నిత్యం ప్రమాదాలు..గంటల తరబడి ట్రాఫిక్ జాం :** మండల కేంద్రంలోని ప్రధాన జంక్షన్ అయిన అంబేద్కర్ సెంటర్ మీదుగా ప్రతిరోజూ వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, రోడ్డుపై ఏర్పడిన గోతుల వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. వర్షపు నీరు గుంతల్లో చేరుతుండటంతో గోతుల తీవ్రత తెలియక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది.

**పట్టించుకోని అధికారులు పాలకులు :** మండల కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి ఇంతలా అధ్వానంగా తయారైనా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని మండిపడుతున్నారు.

**వెంటనే మరమ్మతులు చేపట్టాలి :** ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఏదైనా పెద్ద ప్రమాదం జరగకముందే అంబేద్కర్ సెంటర్ వద్ద మెయిన్ రోడ్డు గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే శాశ్వత ప్రాతిపదికన బీటీ/సీసీ రోడ్డు నిర్మించి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని సంగెం మండల వాసులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# సంగెంలో పాత రోజులు ప్రత్యక్షం..వ్యాపారాల జోరు..!




- టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మారిన సంగెం రూపురేఖలు
- వారంతపు కొనుగోళ్లతో పుంజుకున్న స్థానిక వ్యవస్థ
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్న, పెద్ద వ్యాపారులు

**సంగెం, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రమైన సంగెంలో మళ్లీ పాత రోజుల నాటి అంగడి సందడి నెలకొంది. సమీపంలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కులో పనులు ఊపందుకోవడం, అక్కడ వందలాది మందికి ఉపాధి లభించడంతో స్థానిక మార్కెట్‌కు మహర్దశ పట్టింది. దీంతో సంగెం ప్రధాన వీధులన్నీ వ్యాపార కార్యకలాపాలతో శోభిస్తున్నాయి. రద్దీగా మారిన వీధులు–కొనుగోలుదారుల హడావుడి : ఆదివారం సెలవు రోజు కావడంతో టెక్స్‌టైల్ పార్కులో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగస్థులు తమ కుటుంబ నిత్యావసరాలు, ఇతర వస్తువుల కొనుగోళ్ల కోసం పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకున్నారు. వీరికి తోడు చుట్టుపక్కల వివిధ గ్రామాల ప్రజలు కూడా అంగడికి రావడంతో ప్రతీ షాపు కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఆనాటి రోజులు గుర్తొస్తున్నాయంటున్న స్థానికులు : గతంలో సంగెం అంగడి ఎంతో ప్రసిద్ధి చెంది, ఎప్పుడూ రద్దీగా ఉండేదని, మధ్యలో కొంత తగ్గినప్పటికీ టెక్స్‌టైల్ పార్క్ రాకతో మళ్లీ ఆనాటి వైభవం కళ్లముందు కనిపిస్తోందని స్థానిక నివాసితులు వ్యాఖ్యానించారు.

లాభాల బాటలో స్థానిక వ్యాపారులు: గత కొంతకాలంగా మందకొడిగా సాగిన వ్యాపారాలు ఇప్పుడు మళ్లీ పుంజుకోవడంతో స్థానిక దుకాణదారులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆదివారం కొనుగోళ్లు జోరుగా సాగుతుండటంతో సంగెం ప్రాంత ఆర్థిక పరిస్థితులు మారుతున్నాయని వ్యాపారస్తులు తెలిపారు.



# హిస్టరీ రీ-క్రియేట్ చేసిన"1990-91 SSC బ్యాచ్"..!

**30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన బాల్య మిత్రులు..నాటి గురువులకు ఘన సన్మానం..!**



**సంగెం, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1990–91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పద్మశాలి హాల్ లో ఆదివారం నాడూ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో, కన్నులపండువగా జరిగింది. పాఠశాల విద్యను పూర్తి చేసుకుని దాదాపు 30 ఏళ్లకు పైగా సమయం గడిచిన తర్వాత, వివిధ ప్రాంతాలు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరారు. నాటి బాల్య జ్ఞాపకాలను, తీపి ముచ్చట్లను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య సమయాన్ని గడిపారు. ఈ కార్యక్రమానికి నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన పూర్వ ఉపాధ్యాయులు రాజేశ్వర్రావు, చంద్రారెడ్డి, రవీందర్, శంకరయ్య, తదితరులకు పూర్వ విద్యార్థులంతా తమ గురువులకు పాదాభివందనం చేసి, పూలమాలలు, శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లే తాము ఈరోజు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నామని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు :** ఈ వేడుకలో భాగంగా నిర్వహించిన సరదా ఆటలు, పాటలు, పాత జ్ఞాపకాల పంపిణీ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మిత్రులందరూ కలిసి విందు భోజనం చేసి, ఒకరిక్షేమ సమాచారాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని, ఏటా ఇలాంటి ఆత్మీయ కలయికలను కొనసాగించాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రహీమ్ పాషా, గొంగళ్ల సాంబయ్య, గాయపు రంగారెడ్డి, మక్కేన శ్రీను, దాసరి రాజు, మహేందర్, బంటు శ్రీను, యాకయ్య, ఇందుర్ రవి, ఊకంటి శ్రీనివాస్, సునీల్, ప్రభాకర్, సురయ్య, సంపత్, కుమార్, ఉమశంకర్, కరుణ శ్రీ,వాణి శ్రీ,శ్రీ వాణి, పద్మ, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య యువజన విభాగానికి నూతన జోష్

**రాష్ట్రస్థాయి బాధ్యతలు స్వీకరించిన వరంగల్ జిల్లా యువ నాయకులు**





**పర్వతగిరి, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** హైదరాబాద్‌లోని లకిడికపూల్ ఆర్యవైశ్య కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండలకేంద్రానికి చెందిన చిదరాల వేణుగోపాల్ తోపాటు వరంగల్ జిల్లాకు చెందిన గార్లపాటి సంతోష్ కుమార్, సుద్దాల రమేష్, మల్యాల వినయ్ కుమార్, జూలూరి వినయ్ కుమార్, నాగవల్లి సుమన్‌తో పాటు మరో ఇద్దరు యువ నాయకులు రాష్ట్ర యువజన విభాగంలోని వివిధ బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించిన వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం, ఆర్యవైశ్య యువతను సంఘటితం చేయడం తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు, అయినవోలు డైరెక్టర్ దారంపూర్ణ చందర్ నూతన సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్ ప్రతినిధి తాటికొండ కృష్ణమూర్తి సభ్యులను శాలువాలతో సన్మానించి సత్కరించారు.

# ఐలాపూర్ గ్రామానికి తక్షణమే తారు రోడ్డు నిర్మించాలి









**కొమరం భీమ్ యూత్ డిమాండ్**

**కన్నాయిగూడెం, ఆగస్టు 2(ప్రజా జ్యోతి) :** కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ గ్రామానికి మంజూరైన 15 కిలోమీటర్ల తారు రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని కొమరం భీమ్ యూత్ ప్రధాన కార్యదర్శి, పెసా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆలం నాగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పత్రికా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడుస్తున్నా తమ గ్రామానికి ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతి వర్షాకాలంలో నాలుగు నెలల పాటు గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ఐలాపూర్ నుంచి భుట్టాయిగూడెం వరకు రహదారి పూర్తిగా బురదమయంగా మారి, కనీసం కాలినడకన కూడా ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో 100, 102, 104, 108 వంటి అత్యవసర సేవలు గ్రామానికి చేరుకోలేకపోతున్నాయని, అనేక మంది ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల గ్రామంలోని గర్భిణీలు, బాలింతలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు 102 అంబులెన్స్ రాలేకపోవడంతో పంచాయతీ ట్రాక్టర్‌లో తరలించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణలో రోడ్లు లేని గ్రామాలు ఉండకూడదని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఐలాపూర్ గ్రామ రహదారి సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. అలాగే 2023 శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) గ్రామానికి వచ్చి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. మంజూరైన 15 కిలోమీటర్ల తారు రహదారి పనులను వెంటనే ప్రారంభించి, ఐలాపూర్ గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆలం నాగేష్ డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ.. క్షతగాత్రుడికి ధైర్యం..



**పర్వతగిరి, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పర్యటించారు. గుంటూరుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన సిరికొండ ప్రశాంత్‌ను ఎంజీఎం ఆస్పత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం దౌలత్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన విలేఖరి గడ్డం కరుణాకర్ తండ్రి గడ్డం సైదులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నారం షరీఫ్‌లో ఈరగాని సాంబయ్య సతీమణి సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొని నివాళు లర్పించారు. అలాగే నూతన సర్పంచ్ గాడిపెల్లి మహేందర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం మల్లయ్యపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ జాటోత్ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన స్నేహితులైన ఎనగందుల శంకర్,ఎండి రఫీ,అశోక్, దేవరకొండ భూపతి,కళ్లెం రమేష్,పోరిక మోతిలాల్, వంశీ తదితరులతో జవహర్ నగర్ ఎర్రిగట్టమ్మ ప్రాంతంలో స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం స్నేహితులతో కలిసి ఈ స్నేహం కలకాలం వర్ధిల్లాలని కోరారు. అనంతరం స్నేహితులు అందరూ కలిసి ఎవరింటికి వారు చేరారు.

## వర్ధన్ ఆశ్రమంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం

**– బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ కోశాధికారి పసునూరి సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ' ఆధ్వర్యంలో జనగామలోని వర్ధన్ ఆశ్రమంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అరుణ్ గోపాల్ మాట్లాడుతూ సమాజంలో స్నేహానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలంతా స్నేహభావంతో కలిసి మెలిసి ఉండటం వల్ల జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను సులభంగా అధిగమించవచ్చని అన్నారు. ఒక మంచి స్నేహితుడు జీవితంలో సానుకూల మార్పుకు కారణమవుతాడని ఆయన పేర్కొన్నారు. ఈ సంధర్భంగా సోసైటీ కోశాధికారి పసునూరి సురేష్ ఆధ్వర్యంలో ఆశ్రమ వాసులకు అన్నదాన వితరణ నిర్వహించారు. స్నేహితుల దినోత్సవాన్ని ఇంత ఘనంగా జరుపుకునేలా సహకరించినందుకు సురేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆశ్రమంలో ఈ కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా వర్దన్ ఆశ్రమ నిర్వాహకురాలు లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ చేస్తున్న పనులను వారి స్నేహభావం ఐక్యత గురించి కొనియాడుతూ ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు కొండ్రాతి నరేష్, జనరల్ సెక్రెటరీ రవి చిలుసాని, మాజీ అధ్యక్షుడు గుర్రం రమేష్, ఉపాధ్యక్షురాలు నర్మెట మమతా రాణి, మైలపాక అంజి, సెక్రటరీ వల్లూరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులు



**చెన్నారావుపేట ఆగస్టు 02 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మూడవ రోజు స్మారక కార్యక్రమాన్ని ఆదివారం రోజు నల్లబెల్లి లోని అయన ఇంటి దగ్గర నిర్వహించారు ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింతకింది వంశీ, అమ్మ రాజేష్, ములుక సాంబయ్య, బోడ సమూ నాయక్, బాదవతు వీరన్న, కేశవరెడ్డి, అంగోత్ వీరసింగ్, బోడ మురళి నాయక్, మల్లాడి వీరారెడ్డి, బానోత్ గణేష్, మెడి సతీష్,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

# అమ్మవారిని దర్శించుకున్న గాజుల సుకన్య శ్రీనివాస్

నకిరేకల్ ఆగస్టు 2 ప్రజా జ్యోతి
నకిరేకల్ పట్టణంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ స్వయంభు కాళికామాత 14వ ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, నకిరేకల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పాడిపంటలు సుఖసంతోషాలతో



ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు గాజుల సుకన్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గ్గ్రె మురళీమోహన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు నకిరేకల్ పట్టణంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ స్వయంభు కాళికామాత 14వ ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, నకిరేకల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పాడిపంటలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కూడా ప్రార్థించినట్లు గాజుల సుకన్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గ్గ్రె మురళీమోహన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుల దినోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శుభాకాంక్షలు

నల్గొండ .ఆగస్టు 2, ప్రజా జ్యోతి:
స్నేహితుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి



దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్నేహబంధం, పరస్పర ఆత్మీయతపై వారు మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, నాగులవంచ లింగారావు తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్‌లో వైభవంగా శ్రీ స్వయంభు కాళికామాత బోనాలు

నకిరేకల్ ఆగస్టు 2 ప్రజాజ్యోతి :
నకిరేకల్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో 14వ ఆషాఢ శ్రీ స్వయంభు కాళికామాత బోనాల ఉత్సవాలు గత మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి







మొక్కులు చెల్లించుకుంటున్నారు.
ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గ్గ్రె మురళి మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా శ్రీ స్వయంభు కాళికామాత బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆదివారం మొదటి బోనాన్ని కాలనీవాసి ఘోరండ్ల శివ కుటుంబం నుంచి సమర్పించగా, అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకోవచ్చని తెలిపారు. మొదటి బోనం సమర్పించిన పోరండ్ల వెంకటయ్య మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబం నుంచి వరుసగా నాలుగోవ సంవత్సరం మొదటి బోనం సమర్పించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని, ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ఘనంగా బోనాలు.సమర్పించిన హిరేకర్ నాగరాజు

భువనగిరి,ఆగస్ట్ 2(ప్రజాజ్యోతి)
భువనగిరి పట్టణంలో శ్రీ ఉప్పలమ్మ పండుగ సందర్భంగా, ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు హెరేకర్ శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారికి బోనం సమర్పించి,పూజలు నిర వ్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి లో భాగమని అన్నారు. అలాగే అమ్మవారి అశీస్సులు



భువనగిరి పట్టణ ప్రజలపై ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్,సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, కౌన్సిలర్లు భక్తుల తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ ఇండియా నినాదంతో ఈనెల 10న జరిగే ' జైల్ బరో ' ను విజయవంతం చేయాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ, ఆగస్టు02, ( ప్రజాజ్యోతి ):
స్వాతంత్రోద్యమ కాలంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేటి కేంద్ర, రాష్ట్ర పాలకులు అవలంభిస్తున్న విధానాలపై నిరసిస్తూ ఈనెల 10న, చేపట్టే 'జైల్ భరో 'కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం మండలం లోని తుంగపాడు గ్రామంలో నవంబర్లో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా రైతులను కలిసి మహా సభలకు కావలసిన విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన తెలంగాణ లోని నల్లగొండ జిల్లాకు ప్రత్యేకస్థానం ఉందని ఆస్ఫూర్తితో పాలకుల విధానాలపై ఎప్పటిక ప్పుడు సిపిఎం రాజీలేని పోరాటాలు చేస్తుంద న్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దివాలా కోరు విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు పూర్తిగాని ర్వీర్యమైనాయని అదే విధంగా రైతు చేతిలోని భూమిని కార్పొరేట్ శక్తులకు అప్పగించే



ప్రయత్నం చేస్తున్నారని వీటికి వ్యతిరేకంగాఉద్య మాలు చేయాల్సిన అవ సరం ఉందన్నారు . ఆరు కాలాలు కష్టించి పండించిన రైతు ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకుండాజరుగుతున్న అన్యాయాన్ని పాలకులు పట్టించు కోవడంలేదని విమర్శించారు. పైగా విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ మీటర్లను బిగించి రైతులు కరెంటుబిల్లు చెల్లించేలా దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారని ఆయన తెలిపారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతు న్నాయని సామాన్య మధ్యతరగతి ప్రజలు దుర్భర జీవనం గడిపే స్థితి నెలకొన్నదని వారు వాపోయారు. దేశవ్యాప్తంగా రైతులు పడుతున్న కష్టాలను సమీక్షించి వాటి పరిష్కారానికిచేప ట్టాల్సిన ఉద్యమాలను నవంబర్ 19 నుండి నల్లగొండలోజరిగే జాతీయ రైతు సంఘం మహాసభలు చర్చించ నున్నాయన్నారు. జాతీయ స్థాయిలో జరిగే మహాసభలకు రైతులు వ్యాపారులు సామాన్య ప్రజలు మద్దతునిచ్చి జయప్రదం చేయడానికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్,రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి రవి నాయక్, సభ్యులు రమేష్ ప్రజలు పాల్గొన్నారు.

## స్కూటీని ఢీకొట్టిన కంటైనర్... భార్య మృతి, భర్త కు తీవ్ర గాయాలు

### బంధువులు, గ్రామస్తుల ఆందోళన
### కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 02,( ప్రజాజ్యోతి ):
మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్ర నగర్ బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న భార్యాభ







ర్తలను కంటైనర్ వాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా వర్త ఆసుపత్రి పాలైన సంఘటన జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాటర్ ట్యాంక్ తండాకు చెందిన ధనావత్ సేవ్యా, తన భార్య ధనావత్ కమల (40)తో కలిసి స్కూటీపై మిర్యాలగూడ వైపు వచ్చే క్రమంలో రవీంద్ర నగర్ బైపాస్ వద్ద అద్దంకి – నార్కట్పల్లి రహదారిదాటుతుండగా నల్గొండ నుండి వాడపల్లి వైపు వెళ్తున్న కంటైనర్ వాహనం అతి వేగంగా స్కూటీ వెనక నుండి బలంగా ఢీకొట్టడంతో స్కూటీ వెనకవైపు కూర్చున్న కమల మృతదేహం తీవ్ర గాయాలతో చిద్ర మైపోయి అక్కడికక్కడే మృతిచెందగా, సేవ్యా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగినప్పటికీ కంటైనర్ వాహనం డ్రైవర్ ఆపకుండా పరారయ్యాడు. గమనించిన స్థానికులు సేవ్యా ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ సోమనర్సయ్య తెలిపారు.



బంధువుల ఆందోళన :- రోడ్డు ప్రమాదం పై సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జంక్షన్ల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతూ అనేకమంది మృత్యువాత పడుతున్నారని, ఫ్లైఓవర్లు నిర్మిస్తామంటున్న ప్రజాప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీంతో ప్రమాదాలు రోజు రోజుకి ఎక్కువ అవుతున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లైఓవర్ల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని, మృతురాల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ పరామర్శ :- ప్రమాదం పై సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## రోస్టర్ విధానాన్ని సవరించాలి ..మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు

నల్గొండ ఆగస్టు 2,(ప్రజా జ్యోతి )
జాతీయ మాలమహానాడు ఆధ్వర్యములో ఈనెల 8న నల్లగొండ లోని గడియారం సెంటర్ వద్ద చేపట్టే మహా ధర్నా కు మాలలు



అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు పిలుపునిచ్చారు.
ఆదివారం మండలంలోని చందనపల్లి గ్రామంలో మహాధర్నకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పుట్టిన నాటి నుంచి నేటి వరకు పార్టీకి వెన్ను దండుగా ఉంటూ కాంగ్రెస్ ను భుజాల మీద మోస్తూన్నా మాలలను రేవంత్ రెడ్డి మోసం చేశాడని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను ఆశాస్త్రీయంగా వర్గీకరించి మాలలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న వర్గీకర ణను రద్దు చేసి రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. మాలలంతా సంఘటితమై ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే అంతవరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ నెల 8న నిర్వహించే మాలల మహాదారులకు జిల్లా నలుమూలల నుంచి మాలలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ ప్రోగ్రాం ఇన్చార్జి కూన యాదయ్య, పట్టేటి రవి, గంగుల యాదయ్య, సంద నాగరాజు, నీరుడు నాగయ్య, వల్కి నితిన్, సంద సాయి,శివ, సామ ఇస్సాకు, తెలగమళ్ల గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పని చేస్తూ.. పార్టీని మరింత బలోపేతం చేయాలి..!

### గుండు నరేందర్ గౌడ్ సన్మాన సభలో ఎమ్మెల్యే బిఎల్ ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 02,( ప్రజాజ్యోతి ):
నూతనంగా బాధ్యతలు చేపట్టిన సమిష్టిగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే



బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) కోరారు. ఆదివారం పట్టణంలోని గౌడ సంఘం భవనంలో నూతనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గుండు నరేందర్ గౌడ్ సన్మాన కార్యక్రమం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కృషి చేయాలన్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేసి కార్యకర్తలకు నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటూ పని చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గుండు నరేందర్ గౌడ్ తో పాటు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మొయిజ్ తదితరులను ఘనంగాసత్కరించారు. అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చిలుకూరి బాలకృష్ణ, గుడిపాటి నవీన్,గౌడ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీనాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాళికామాతకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక పూజలు

నకిరేకల్, ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):
నకిరేకల్ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో కొలువుదీరిన శ్రీ శ్రీ స్వయంభు కాళికామాత ఆలయంలో నిర్వహిస్తున్న 14వ ఆషాఢ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



గత 14 సంవత్సరాలుగా ఆలయంలో సంప్రదాయ పద్ధతుల్లో పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించడం ద్వారా భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు ఆషాఢ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాళికామాతను దర్శించుకున్న నేతి విద్యాసాగర్, దైద రవీందర్

నకిరేకల్ .ఆగస్టు 2. ప్రజా జ్యోతి:
నకిరేకల్ పట్టణ కేంద్రంలోని శ్రీ స్వయంభూ కాళికామాత ఆలయంలో నిర్వహిస్తున్న 14వ ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ



సభ్యుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, జటంగి వెంకటనర్సయ్య, కోట పుల్లయ్య, అరూరి వెంకటేశ్వర్లు, సకినాల రవికుమార్, ఆకుల నాగయ్య, సైదులు తదితరులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితా లో నమోదయ్యేలా చూడాలి..!

### బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి సర్ ప్రక్రియను పరిశీలన

మిర్యాలగూడ, ఆగస్టు 02,( ప్రజాజ్యోతి ): అర్హులైన ప్రతి ఒక్క ఓటరు సర్ ప్రక్రియలో నమోదయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి కోరారు. ఆదివారంమిర్యాలగూడ అసెంబ్లీనియోజకవర్గంలోని 1-టౌన్ పరిధిలోని 16వ, 2వ, 3వ, 14వ వార్డుల్లోకొనసాగుతున్న సర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించబడాలని అన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం సర్ ప్రక్రియనుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన దని, ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్, మిర్యాలగూడ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి , యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్ యాదవ్ , ప్రధాన కార్యదర్శిలు కొంగర వెంకటరమణ,మూలా రాజిరెడ్డి,చిలుకూరు వెంకటేశ్వర్లు,రాష్ట్ర నాయకులు బంటు సైదులు,రేపాల పురుషోత్తం రెడ్డి, ఏడ్ల రమేష్,అశోక్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజు, పెద్దబోయిన వెంకటరమణ,చిల్లంచర్ల అభి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద శివ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో బోనాల శోభ.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

### మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అందోల్, ఆగస్టు 2, (ప్రజాజ్యోతి):
జోగిపేట పట్టణం ఆదివారం బోనాల పండుగ సంబరాలతో కళకళలాడింది. పట్టణంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, సంప్రదాయ నృత్యాలు, అమ్మవారి జైజైకారాలతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





పట్టణంలోని 9వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో కౌన్సిలర్ శ్రీమతి శోభా నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో, శ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. 13వ వార్డులోని శ్రీ గడి మైసమ్మ తల్లి ఆలయంలో కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. పట్టణ రక్షక దేవతగా భావించే శ్రీ పోచమ్మ తల్లి ఆలయంలో కూడా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పీ. నారాయణ ముదిరాజ్, డి.బి. నాగభూషణం, మాజీ ఎంపీపీ రామగౌడ్, బీఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్, చాపల వెంకటేశం, బిర్ల శంకర్, ఊస నాగరాజు, ఆకుల శంకర్, డాకూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులు రాజశేఖర్ కులకర్ణి, ప్రదీప్ గౌడ్, గాజుల అనిల్ కుమార్, అయ్యప్ప నర్సింలు హాజరయ్యారు. భక్తుల రద్దీతో జోగిపేట ప్రధాన వీధులు సందడిగా మారగా, బోనాల పండుగను ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.

## భావితరాలకు స్ఫూర్తిదాయకం బాదిని చెన్నయ్య పోరాటం

### పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తపించిన మహనీయుడు

### సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య.

### డిజైర్ సొసైటీ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

పటాన్ చెరు/(ప్రజాజ్యోతి):
బావి తరాలకు ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ చైర్మన్ భాదిని చెన్నయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య అభిప్రాయప





డ్డారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత భాదిని చెన్నయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని 'డిజైర్ సొసైటీ' అనాథ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సిఐటియు (రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా కే. రాజయ్య మాట్లాడుతూ.. బాదిని చెన్నయ్య ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చి, తన కృషి పట్టుదలతో అంచలంచెలుగా ఎదిగి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. సీపీఐ(ఎం) పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడని ఆయన స్మరించుకున్నారు. పేదరికం ఎంతలా వెంటాడిన దృఢ సంకల్పంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఎదిగారన్నారు. వ్యవసాయ కూలీగా.. పోరాట యోధుడిగా.. రాజకీయ నేతగా.. ప్రజాప్రతినిధిగా.. పేదోడి కంచంలో మెతుకులా.. ఉన్నోడి అహంకారానికి ధిక్కార స్వరంలా.. ప్రజాసమస్యలపై పోరాడి నిలిచిన మార్గదర్శకుడు బాదిని చెన్నయ్య అని గుర్తు చేసుకున్నారు. నోముల గ్రామంలోని నాటి అసమానతలను ఎవ్వరికి ఇబ్బందులు కలిగించకుండా తన రాజకీయ చతురతతో పరిష్కరించిన తీరు అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా భాదిని చెన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాదిని శ్రీను, సత్యం, రాజ్‌కుమార్, శ్రీనివాస్,మహేష్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రదీప్ రెడ్డి, అనిల్ తో పాటు డిజైర్ సొసైటీ నిర్వాహకులు, సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అంబరానంటిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

రెంజల్, ఆగష్టు 02(ప్రజాజ్యోతి ):
రెంజల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు అంబరానంటాయి.
ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలో భాగంగా భారీ కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకొని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల లో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం కందకుర్తి గ్రామం లో చిన్నారులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం సానియా గార్డెన్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్ మాట్లాడుతూ రైతు బాంధవుడు, జనహృదయనేత, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు,



కార్యకర్తలు, ప్రజల సమక్షంలో ఘనంగా జరుపుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకొని నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా బోధన్ నియోజకవర్గ ప్రజలకు సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయి రెడ్డి, సిడిసి మాజీ డైరెక్టర్ సాయిబాబా గౌడ్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు లచ్చావార్ నితిన్,జిల్లా ప్రధాన కార్యదర్శి సి హెచ్ రాములు, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు ఇందిరా రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెల్ రాజు, సురేందర్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ జావిద్, శనిగరం సాయి రెడ్డి, నూతన సర్పంచులు గియాజుద్దీన్, ధనుంజయ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గైని కిరణ్, ఆసాని అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అబ్బోల శ్రీకాంత్, రెంజల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సగ్గు వెంకటి, నీలా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సొక్కుల సాయిలు, రెంజల్ గ్రామ మైనార్టీ సెల్ అధ్యక్షులు అజాం ఖాన్, ఆర్మూర్ గంగాధర్, అశోక్ మాజీ ఎంపీటీసీ బోగిడి కవిత, ఆసాని రాధా, సుధా కృష్ణ, లక్ష్మి , బోగిడి రవి, ఆనంద్, గైని సాయిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మర్కల్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవం

### శాస్త్రీయ దృక్పథంతో పరిశోధనల వైపు యువత అడుగులు వేయాలి

### ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి


కామారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భారతీయ రసాయన శాస్త్ర పితామహుడుఇండియన్ ఫాదర్ కెమిస్ట్రీ ఆచార్య ప్రఫుల్ల



చంద్ర రాయ్ జయంతి సందర్భంగా జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. శాస్త్ర విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఆధునిక రసాయన శాస్త్రానికి పునాదులు వేసిన మహనీయుల్లో ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ అగ్రగణ్యులని కొనియాడారు. శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా గొప్ప విద్యావేత్తగా, పరిశోధకుడిగా, పారిశ్రామికవేత్తగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్ వర్క్స్ స్థాపన ద్వారా స్వదేశీ పారిశ్రామికాభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు.
ప్రస్తుత కాలంలో శాస్త్ర విజ్ఞానం ప్రతి రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాలు, పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. సమాజ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనే దిశగా యువత ముందుకు రావాలని, పరిశోధనల ద్వారా దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.
రసాయన శాస్త్ర విభాగాధిపతి మీనా మాట్లాడుతూ ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శమని అన్నారు. భారతీయ రసాయన శాస్త్ర పరిశోధనలకు ఆయన అందించిన సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. శాస్త్రవేత్తగా ఆయన చేసిన పరిశోధనలు, రచనలు, శాస్త్రీయ ఆలోచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని వివరించారు. రసాయన శాస్త్రం వ్యవసాయం, వైద్యం, ఔషధ తయారీ, పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత వంటి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని విద్యార్థులకు వివరించారు.
ఈ సందర్భంగా విద్యార్థినులు రసాయన శాస్త్రం ప్రాముఖ్యత, ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ జీవిత విశేషాలు, శాస్త్రీయ పరిశోధనల అవసరం, విజ్ఞానంతో సమాజాభివృద్ధి వంటి అంశాలపై ప్రసంగాలు చేశారు. పలువురు విద్యార్థినులు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను వివరిస్తూ తమ ఆలోచనలను పంచుకున్నారు. శాస్త్రీయ ఆలోచనలతో కూడిన ఉపన్యాసాలు సభలో ఉన్న వారిని ఆకట్టుకున్నాయి.
జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన కెమిస్ట్రీ క్విజ్, వ్యాసరచన, ప్రసంగ పోటీలు, విజ్ఞాన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విజేతలను అధ్యాపకులు అభినందిస్తూ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానం సమాజ పురోగతికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని, శాస్త్రాన్ని కేవలం ఒక సబ్జెక్టుగా కాకుండా జీవన విధానంగా అర్థం చేసుకోవాలని సూచించారు.
రసాయన శాస్త్ర అధ్యాపకురాలు ఝాన్సీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగశాలల్లో నిర్వహించే ప్రతి ప్రయోగం వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను అవగాహన చేసుకొని పరిశోధనా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. శాస్త్రంపై ఆసక్తి పెరిగితేనే దేశం పరిశోధన రంగంలో మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, అన్ని తరగతుల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా శాస్త్రీయ విజ్ఞానం, పరిశోధనల ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

### వరద నీటిలో పల్లె ప్రకృతి వనం

డోంగ్లి ఆగస్టు 02 (ప్రజాజ్యోతి)
కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయానికి పక్కనే గల పల్లె ప్రకృతి వనం వరద నీటిలో



మునిగింది. గత ప్రభుత్వం గ్రామగ్రామాన పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసినప్పటికి వాటి నిర్వహణ గాలికి వదిలి వేయడంతో పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మల్కాపూర్ శేషాద్రి నగర్ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్..

కొండాపూర్ ప్రజా జ్యోతి:
కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామ శేషాద్రి నగర్‌లో ఘనంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ



సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఉత్సవాలకు పెద్ద ఎత్తున హాజరైన భక్తులను ఎమ్మెల్యే పలకరించి, బోనాల వంటి సంప్రదాయ పండుగలు మన సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యంగా పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమానికి శేషాద్రి నగర్ కాలనీ అధ్యక్షుడు నాగభూషణం, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విట్టల్, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పవన్ కుమార్, ప్రశాంత్, మైపాల్‌తో పాటు కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టకాలంలో ప్రజాసేవకు ముందుకు రాని నాయకులు.?

**గంగమ్మ వాగు బ్రిడ్జి పనుల నత్త నడక పనులపై ఆగ్రహం**

**పట్టించుకునే నాయకులే లేరా..?**

**ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా..?**

**బ్రిడ్జి సరిగ్గా పూర్తి కాలేక డైవర్షన్ అవుతున్న బస్సులు**

**సామాన్యుని గుండెను తాకే ప్రశ్న...?**

**నాయకుడా నువ్వు ఎక్కడ..!**

రామారెడ్డి ఆగస్టు 02(ప్రజా జ్యోతి):
సమాజంలో ఎదురయ్యే విపత్తులు, అత్యవసర పరిస్థితులు సమాన్య ప్రజలకు మాత్రమే కాదు, అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత కలిగి ఉంటాయి. సినిమారంగం,





ఉద్యోగ వర్గాల నుంచి విరాళాలు వచ్చినప్పుడు, రాజకీయ నాయకుల నుండి కూడా ఆ విధమైన స్పందన ఆశించడంలో తప్పు లేదు. సినిమాహీరోలు, ప్రభుత్వ ఉద్యోగులు తమ సంపాదనలో ఒక భాగాన్ని విరాళంగా ఇస్తే, ప్రజల కోసం పనిచేస్తున్న నాయకులు తమ జీతాన్ని విరాళంగా ఇవ్వడం సమంజసం. అయితే, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న ఒక నిస్సహాయత ఉంది ఎన్నో హామీలు ఇచ్చి ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు, ఇలాంటి సంక్షోభ సమయంలో ఎందుకు నిష్క్రియంగా ఉంటున్నారు? తమ పదవులు, హోదాలు, సౌకర్యాలు మాత్రమే కాకుండా, ప్రజలకు సేవ చేయడం కూడా వారి బాధ్యత కాదా? ఇలాంటి ప్రశ్నలు సామాన్య ప్రజల మనసుల్లో కలుగుతాయి. ప్రజలు ఎంచుకున్న నాయకులు నిజంగా ప్రజల కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా లేదా? హంగులు, ఆర్భాటాలకే పరిమితమవుతారా? వారి నిజమైన లక్ష్యం ప్రజల



కష్టాలను తీర్చడమా లేక కేవలం రాజకీయ లాభాల కోసం మాత్రమే పనిచేస్తారా? ఇవన్నీ సామాన్యుడి ఆలోచనలుగా ఉండటం సహజం. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, వారికి ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు, ఈ సమయంలో మానవతను ప్రదర్శిస్తూ ముందుకు రావాలి. ఇలాంటి సందర్భాల్లో నాయకుల నిస్వార్థ సేవ ప్రజలకు విశ్వాసాన్ని కలిగిస్తుంది, వారిని స్ఫూర్తిగా అనిపిస్తుంది. రాజకీయ నాయకులు తమ బాధ్యతను మరచిపోవద్దు, కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలవాలి. వరదలు ప్రజల జీవితాలను పూర్తిగా అతలాకుతలం చేశాయి. చాలా ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు తమ నివాసాలను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. వారు ఆపద సమయంలో కనీస అవసరాలను కూడా పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తినేందుకు తిండి, తాగేందుకు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అందడం లేదు. ప్రభుత్వాలు, సహాయక సంస్థలు సహాయ చర్యల కోసం కృషి చేస్తున్నా, ప్రతి ఒక్కరికి అవసరమైన సాయం అందడం ఆలస్యం అవుతోంది. దీనితో పాటు, ప్రజలు అనారోగ్య సమస్యలతో కూడిన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తగిన సాయం అందక, చాలా మంది తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, బాధితులు సత్వర సహాయం కోసం నిరీక్షిస్తున్నారు. తక్షణమే తిండి, నీరు, మెడికల్ సహాయం వంటి ప్రాథమిక అవసరాలు అందించడానికి కృషి చేయాలి. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడంతో పాటు, బాధితుల పునరావాసంపై దృష్టి సారించడం అత్యవసరం.

# పేద విద్యార్థినికి పెద్ద భరోసా

– నాలుగేళ్లుగా కొనసాగుతున్న చేయూత – మరోసారి హరీష్ రావు మానవత్వం

సిద్దిపేట, ఆగస్టు 02 ,(ప్రజాజ్యోతి): తండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వైద్య



విద్య కొనసాగించలేనేమోనన్న ఆందోళనలో ఉన్న విద్యార్థిని అఖిలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అండగా నిలిచారు. ఎంబీబీఎస్ సీటు ఎక్కడ వచ్చినా పూర్తి ఫీజుతో పాటు వైద్య విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

ఇటీవల నిర్వహించిన నీట్–2026 పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచిన అఖిలను, ఆమె తల్లి రేణుకను తన నివాసానికి ఆహ్వానించిన హరీష్ రావు, వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ధైర్యం నింపారు. నువ్వు ఎలాంటి ఆందోళన చెందొద్దు... సీటు సాధించు. డాక్టర్ అయ్యే వరకు చదివించే బాధ్యత నాది అని ఆమెకు భరోసా కల్పించారు.సిద్దిపేట పట్టణానికి చెందిన మద్దూరి రాజు బజరంగ్ టీ హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవారు.

కొన్నేళ్ల క్రితం బ్రెయిన్ క్యాన్సర్‌తో ఆయన మృతి చెందడంతో భార్య రేణుక, ముగ్గురు కుమార్తెలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న హరీష్ రావు వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయించడంతో పాటు పిల్లల చదువుకు అండగా నిలిచారు.ఆ సమయంలో అఖిల 9వ తరగతిలో చదువుతోంది. ఆమె చదువులో ప్రతిభ ఉన్నప్పటికీ ఫీజులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో హరీష్ రావు



స్వయంగా మెరిడియన్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని సంప్రదించి, ఈ విద్యార్థిని చదువు ఆగకూడదు... అవసరమైన ఫీజు నేను భరిస్తానని తెలిపారు. దీంతో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు మెరిడియన్ విద్యాసంస్థలు పూర్తి సహకారం అందించాయి.చదువులో ఎప్పుడూ అగ్రస్థానంలో నిలిచిన అఖిల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నీట్ పరీక్షలో 720 మార్కులకు 453 మార్కులు సాధించింది. ఈ మార్కులతో ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ, వైద్య విద్యకు అవసరమైన భారీ ఫీజులు కుటుంబానికి అందని ద్రాక్షగా మారాయి.ఈ విషయం తెలుసుకున్న హరీష్ రావు వెంటనే స్పందించి, అఖిలను తన నివాసానికి పిలిపించి వైద్య విద్యకు పూర్తి భరోసా ఇచ్చారు.అఖిల చదువు ఆగకుండా నాలుగేళ్ల పాటు సహకరించిన మెరిడియన్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని హరీష్ రావు అభినందించారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి సహకరించిన యాజమాన్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

## ఏడుపాయల్లో ఆషాఢ శోభ ఫలాంబరి అవతారంలో దర్శనమిచ్చిన వనదుర్గా భవానీ మాత!

మెదక్ (ప్రజా జ్యోతి) : మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతోంది! ఆషాడ మాసం



ఆదివారాన్ని పురస్కరించుకొని... ఏడుపాయల వనదుర్గ అమ్మవారు ఈరోజు భక్తులకు "ఫలాంబరి" రూపంలో దివ్య దర్శనమిచ్చారు! దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు అమ్మవారిని అనేక రకాల తాజా ఫలాలు (పండ్ల)తో నయన మనోహరంగా అలంకరించారు. ఆధ్యాత్మిక శోభతో మెరిసిపోతున్న అమ్మవారి ఫలాంబరి అవతారాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి పోటెత్తారు. పావన ఆషాడ మాసం కావడం, పైగా ఆదివారం కావడంతో తెలంగాణ నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఏడుపాయల క్షేత్రం కిటకిటలాడింది. పవిత్ర మంజీరా నదీ పాయల్లో పుణ్యస్నాలు ఆచరించిన భక్తులు... ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## మెదక్ పాత హనుమాన్ మందిరంలో ఘనంగా 'రామ భజన' – ఆధ్యాత్మిక పారవశ్యంలో భక్తులు!

మెదక్ (ప్రజా జ్యోతి): మెదక్ పాత హనుమాన్ మందిరంలో ఘనంగా సాగుతున్న 'రామ భజన' – చిన్నతనం నుంచే పిల్లలలో భక్తిభావాన్ని పెంపొందించడమే లక్ష్యం! మెదక్ పట్టణంలోని ప్రముఖ పురాతన శ్రీ హనుమాన్ మందిరం (షిమాన్) యందు గత



మూడు, నాలుగు వారాలుగా "రామభక్త భజన పరివార్" ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన భక్తుల భాగస్వామ్యంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ భజన కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి, స్థానిక భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి వారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలుతున్నారు.

## రెడ్డి యువజన సంఘం అధ్యక్షునిగా సదానంద రెడ్డి ఎన్నిక

మిరుదొడ్డి, ఆగస్టు 2, (ప్రజాజ్యోతి): మిరుదొడ్డి మండల కేంద్రంలో రెడ్డి యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా లింగాల సదానంద రెడ్డి ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా సత్తు రాకేష్ రెడ్డి, తోకల సాయి వంశీధర్ రెడ్డి, భరత్ రెడ్డి, కోశాధికారిగా తోకల



కమలాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తోట వినయ్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నంద్యాల శివారెడ్డి, కొమ్మెర నరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. సలహాదారులుగా తోట నరసింహారెడ్డి, గంజి వేణుగోపాల్ రెడ్డి, తోకల శ్రీకాంత్ రెడ్డి, కొమ్మెర వెంకటరెడ్డి, సత్తు రాజిరెడ్డి, తోట జనార్ధన్ రెడ్డి, గంజి కొండల్ రెడ్డి, కొమ్మెర మహేష్ రెడ్డి, పాతూరి కొండల్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన లింగాల సదానంద రెడ్డి మాట్లాడుతూ యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి, యువత సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. సంఘం సభ్యుల సహకారంతో రెడ్డి యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసి ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

నూతన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, యువకులు, సంఘ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

కొండపాక, ఆగస్టు 2 (ప్రజా జ్యోతి): కొండపాక మండలంలోని బంధారం గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ అమ్మవారికి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని డప్పు, మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు



సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు సుఖశాంతులు కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# రజకుల అభివృద్ధికి కలిసి పని చేద్దాం

## నవంబర్ లో రజక మహాసభ

సిద్దిపేటఅర్బన్,ఆగస్టు2 (ప్రజాజ్యోతి):- రజకుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు పనిచేద్దామని, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో నవంబర్ మాసంలో జరిగే 4వ మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి పిల్లలను విద్యావంతులను చేయాలనీ పేర్కొన్నారు. ఇప్పుడున్న ఈ తరుణంలో రజకుల కుటుంబాలలో విద్య పెరిగితేనే చైతన్యం పెరుగుతుందని, చైతన్యం పెరిగితేనే మన హక్కులను సాధించుకుంటామని చెప్పారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆవిర్భావం నుండి



రజక పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ పంక్షన్ హాల్ లో జంగంపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో గోపి రజక, రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ బస్వరాజ్ శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు పోతున్నా రజకుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులు చైతన్యవంతం కావడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో రజక బాంధవులందరు వారి అంచలంచెలుగా ఎదుగుతూ నవంబర్ మాసం చివరి వారంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే నాలుగో మహాసభను రాష్ట్ర రజక కులబంధువులందరు కలిసి విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ గౌరవ అధ్యక్షుడు సంగెం ఎల్లన్న, రాష్ట్ర ఉప అధ్యక్షుడు సంబరాజు కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నరసింగరావు, సిద్దిపేట జిల్లా యూత్ అధ్యక్షుడు చింతకింది కరుణాకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేష్, నార్లగిరి కుమార స్వామి, సి హెచ్. యాదగిరి, జూపల్లి నర్సింలు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీట్ కౌన్సెలింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

– పేద విద్యార్థులకు అండగా ఉంటా –మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట, ఆగస్టు 02 ,(ప్రజాజ్యోతి): నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్న



పొరపాటు కూడా విలువైన మెడికల్ సీటును కోల్పోయే పరిస్థితి తీసుకురావొచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.సిద్దిపేట టీచర్స్ భవన్‌లో నిర్వహించిన నీట్ రిజిస్ట్రేషన్, వెబ్ కౌన్సెలింగ్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనాల్సి ఉండగా, వైరల్ ఫీవర్ కారణంగా హాజరు కాలేకపోయారు. ఫోన్ ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడి పలు సూచనలు చేశారు.గతంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులు చేసే చిన్న పొరపాట్ల వల్ల మంచి అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. అందుకే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా మూడు వేర్వేరు కౌన్సెలింగ్‌లలో నమోదు చేసుకోవాలని సూచించారు.తెలంగాణలో ప్రస్తుతం సుమారు 60 మెడికల్ కళాశాలలు ఉన్నాయని, చాలా మంది విద్యార్థులు కేవలం 10 ,15 కళాశాలలను మాత్రమే ఎంపిక చేసుకుని మిగతావాటిని వదిలేస్తున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల సీటు వచ్చే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు జరిగాయని హరీష్ రావు అన్నారు. తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 25 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.ఒకప్పుడు తెలంగాణ విద్యార్థులు చైనా, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు వెళ్లి వైద్య విద్య అభ్యసించేవారని, ప్రస్తుతం ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణకు వచ్చి మెడిసిన్ చదువుకునే స్థాయికి రాష్ట్రం ఎదిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు.ఇటీవల నీట్‌లో ప్రతిభ కనబరిచిన అఖిల అనే విద్యార్థినిని కలిసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆమె తండ్రి మరణించిన తర్వాత చదువుకు సహాయం చేశామని, ఇప్పుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు రావడంతో ఐదేళ్ల ఎంబీబీఎస్ ఫీజులు, పుస్తకాల ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గతంలో కూడా నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు విద్యార్థులకు మెడికల్ విద్య కోసం ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు.ఈ అవగాహన సదస్సులో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



## ఓరుగంటి శ్రీకాంత్‌కు టిఏవై రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

ఎంపిక పట్ల పలువురి అభినందనలు

చేర్యాల, ఆగస్టు 02 ,(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని లక్డికపూల్ వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.





రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎన్నికైన యువజన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ నూతన రాష్ట్ర కార్యవర్గంలో చేర్యాలకు చెందిన ఓరుగంటి శ్రీకాంత్‌కు చోటు దక్కింది. రాష్ట్ర యువజన అధ్యక్షుడు అనిల్ చేతుల మీదుగా శ్రీకాంత్ నియామక పత్రాన్ని అందుకుని పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఓరుగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఆర్యవైశ్య యువత అభ్యున్నతి, సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి అండగా ప్రతిభ జూనియర్ కళాశాల

సిద్దిపేట, ఆగస్టు 02 ,(ప్రజాజ్యోతి): అకాల మరణం చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు గంగాల పర్శరాములు కుటుంబానికి అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ చొరవతో ప్రతిభ జూనియర్ కళాశాల యాజమాన్యం ముందుకొచ్చింది.గత జూలై 11న మృతి చెందిన పర్శరాములు



కుటుంబాన్ని పరామర్శించిన ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ చారి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన పెద్ద కుమార్తె అనుశ్రీ పదో తరగతి పూర్తి చేసిన అనంతరం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యను ప్రతిభ జూనియర్ కళాశాలలో పూర్తిగా ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. సుమారు 50 వేల రూపాయల విలువైన విద్యను ఉచితంగా అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రభాకర్ చారి, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని, అనుశ్రీ విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.టీ.పీ.టీ.ఎఫ్ జిల్లా కమిటీ ఈ సందర్భంగా స్పందిస్తూ, కష్టాల్లో ఉన్న ఉపాధ్యాయ కుటుంబానికి చేయూత అందించడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని తెలిపింది. సమాజంలో ఇలాంటి సేవా భావం మరింత పెరగాలని ఆకాంక్షిస్తూ ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ చారిని అభినందించింది.ఈ కార్యక్రమంలో టీ.పీ.టీ.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాచం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నవీద్, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధులు, ప్రచార కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్నం రుక్మమ్మకు ఘన నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నేతలు

దశదినకర్మలో పాల్గొన్న కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల మహేష్‌రెడ్డి తదితర ప్రముఖులు




**పరిగి, ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్మమ్మ వారి దశదినకర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు, బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మీర్ మహమూద్ అలీ తదితరులు హాజరయ్యారు. పట్నం రుక్మమ్మ సేవలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించిన నాయకులు, పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్నేహబంధమే జీవితంలో అత్యంత విలువైనది : జంపన ప్రతాప్

ఫ్రెండ్షిప్ డే సందర్భంగా జంపన ప్రతాప్‌కు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు



**బోయిన్ పల్లి, ఆగస్టు 2.(ప్రజా జ్యోతి) :** జీవితంలో ఎన్నో బంధాలు ఉన్నప్పటికీ, స్నేహబంధమే అత్యంత గొప్ప దని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. ఫ్రెండ్షిప్ డే సంద ర్భంగా ఆదివారం న్యూ బోయి నపల్లి ప్లే గ్రౌండ్‌లో పలువురు అభిమానులు, స్నేహితులు జంపన ప్రతాప్‌ను కలిసి ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ, విజయాల్లో మాత్రమే కాకుండా అపజయాల సమయంలోనూ అండగా నిలిచే వ్యక్తే నిజమైన స్నేహితుడని పేర్కొన్నారు. జీవితంలో డబ్బు కంటే మంచి స్నేహితుడు ఎంతో విలువైన సంపద అని అన్నారు. పరస్పర నమ్మకం, ప్రేమ, ఆప్యాయతలతో కూడిన స్నేహబంధాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, సురేష్, వాసు గౌడ్, మధుసుధా కర్, యాదగిరి తదితరులు పాల్గొని ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## యోగతోనే ఆరోగ్యకర జీవనం

ఆర్టీసీ కాలనీలో ఉచిత యోగ శిక్షణకు ఐదేళ్లు



**షాద్‌నగర్, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి) :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 8వ వార్డులోని ఆర్టీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమం ఐదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే జీవన విధానమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగాభ్యాసాన్ని అల వాటు చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. గత ఐదేళ్లుగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు ఉచితంగా యోగ శిక్షణ అందిస్తూ ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తున్న పతంజలి యోగ సమితి సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం యోగ సాధకులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి ఆకట్టుకోగా, కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, స్థానికులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ సుదీర్, పానుగంటి శశిధర్, మతంగవయ్య, కాలనీ వాసులు, యోగ సాధకులు, పతంజలి యోగ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి బొట్టు ఉంటే ఒట్టు!





- తాండూరు బస్ డీపోలో మంచినీటి సమస్య
- ప్రయాణికులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ ఉద్యోగులకు తప్పని తిప్పలు
- మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారుల నిర్లక్ష్యం

**తాండూరు, ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్టీసీ డీపోతో పాటు బస్టేషన్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. బస్టేషన్‌కు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఇతర ప్రాంతాల నుంచి పలు వ్యాపారాల నిమిత్తం, ఇతర ఉద్యోగులు, విద్యార్థులు, అలాగే ఆర్టీసీ ఉద్యోగులు ఇక్కడికి వస్తుంటారు. వారికి తాగునీరు అందుబాటులో లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. బస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాలు సరిగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు బయట దుకాణాల్లో నీటి బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా చూసిన కొందరు ప్రయాణికులు బయట లభించే మంచినీటి బాటిల్స్ సైతం కొనుగోలు చేయాలన్న అవి కూడ కల్తీ నీటిని నింపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ప్రజలకు కనీస అవసరమైన స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచేలా సంబంధిత ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, బస్టేషన్‌లో శాశ్వత మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా బస్సు డిపోలో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులలో మహిళలు, పురుషులు సైతం మధ్యాహ్నం భోజనం సమయంలో తాగడానికి మంచి నీళ్ల కోసం రోడ్డుపైకి పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. మరి మహిళలకు ఏ విధమైన ఇబ్బంది అవుతుందో చెప్పనవసరం లేదు. ఇంత జరుగుతున్నా కూడా ఆర్టిసి అధికారులు స్పందించకపోవడం మూర్ఖత్వానికి నిదర్శనమనేది స్పష్టంగా కనిపిస్తుంది. సుమారుగా 8 నుండి 10 గంటల పాటు విధులు నిర్వహించి అలసిపోయిన ఆర్టీసీ ఉద్యోగులు కాస్త మంచినీళ్లు తీసుకోవాలన్న డిపోలో నీటిబొట్టు దొరకడం కష్టంగా మారింది.

# బోనమెత్తిన బషీరాబాద్




- ఘనంగా పోచమ్మ – రేణుక ఎల్లమ్మ బోనాల వేడుకలు
- ప్రత్యేక పూజలో పాల్గొన్న సర్పంచ్ వెంకటేష్ మహారాజ్
- మాజీ జడ్పిటిసి రాకేష్ మహారాజ్
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్

**బషీరాబాద్, ఆగస్టు 2 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ, రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బషీరాబాద్ సర్పంచ్ వెంకటేష్ మహారాజ్, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహారాజ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలను విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ బోనాల పండుగలో చిన్నారులను పోతురాజు వేషాదరంలతో ప్రత్యేకత ఆకర్షణీయంగా బోనాల ఊరేగింపులో పాల్గొనడం జరిగింది. ఆలయ కమిటీ వారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, శివకుమార్, జయరాం చారి పూజారి, పవన్ ఠాకూర్, సాయిల్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ సిద్దార్థ, రాము నాయక్, రఘు, శేఖర్ గౌడ్, డిసిమహేష్, అనూప్, శేఖర్ సార్, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు

– ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగితంమన్మోహన్ గౌడ్.




**మోమిన్ పేట ఆగస్టు 2, (ప్రజా జ్యోతి) :** సర్పంచ్ ఎన్నికల్లో టేకులపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన సుద్దోడ్కతాండ, లో ఇచ్చిన హామీ మేరకు ఫార్మేషన్ రోడ్డు పనులను సొంత నిధులతో టేకులపల్లి గ్రామము నుండి సుద్దోడ్కా తాండకు వెళ్లే దారి లో అర కిలోమీటర్ రోడ్డు పనులనుఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగితం మన్మోహన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి సుద్దోడ్కా తాండా ప్రజలు, రైతులు, విద్యార్థులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతూ టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యంవస్తుండేవారు. కొన్ని సందర్భాల్లో అనారోగ్యానికి గురైన వ్యక్తి మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయని ,ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి రాగా తమ హృదయము చలించి ఎట్టి పరిస్థితుల్లో తాండ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు రోడ్డు సౌకర్యము కల్పిస్తానని తాండవాసులకు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. రోడ్డు వేసేందుకు దళిత పట్టదారులకు, ప్రత్యామ్నాయంగా దళిత రైతులకు రాజు, చంద్రయ్య, నాగేష్, డప్పు మల్లేష్,లకు మిగతావారికి భూమి ఇప్పిస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభాది పతి,గడ్డం ప్రసాద్ కుమార్ తో ప్రత్యేకంగా దళిత రైతులతో మాట్లాడించి వారికి ప్రత్యామ్నాయంగా భూమి ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో, మోమిన్ పేట తాహసిల్దార్ మునీరుద్దీన్ తో స్పీకర్ మాట్లాడగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని తాహసిల్దార్ అన్నారు. దీంతో దళిత రైతులు సంతోషించి పట్టా భూమి ని రోడ్డుకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో మన్మోహన్ గౌడ్ ముందుకు వచ్చి తాండావాసుల ప్రజల చిరకాల వాంఛ నెర వేర్చారు. దీని ద్వారా తండావాస ప్రజలు టేకులపల్లి గ్రామానికి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం సుగమం,అయిందని తాండ ప్రజలు, బివిద్యార్థులు మహిళలు పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు., ఓటమిని అంగీకరించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తూచ తప్పకుండా నెరవేర్చాడు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అండదండలతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రతినిత్యం టేకులపల్లి గ్రామానికి సుమారు 50 మంది విద్యార్థులు పాఠశాలకు, రేషన్ బియ్యం కోసం, టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యం వస్తుంటారు, అలాగే అర్హులైన లబ్ధిదారులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తానని, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించేందుకు కృషి చేస్తానని మన్మోహన్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నే వెంకటేశం యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నరేందర్ గౌడ్, పాండు, ఫయాజ్, సద్దాం, ఫిరోజ్, సీనియర్ నాయకులు కొండాపురం మహబూబ్అలి,ఎగ్బాల్ జలీల్, ఆర్ శ్రీనివాస్, బి అశోక్, టి ప్రఘోప్, బాబు నాయక్, దీప్లా నాయక్, ప్రశాంత్, టేకులపల్లి సీనియర్ నాయకులు శ్రీకాంత్ బబ్లు, రామావత్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పార్టీ నాయకులు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 9 మంది బాలింతలకు బీఎమ్ఆర్ కిట్ పంపిణీ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగిశెట్టి సతీష్ కుమార్



**బషీరాబాద్ ఆగస్టు 2 ప్రజాజ్యోతి :** తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేరుపైన 9మంది బాలింతలకు కిట్ల పంపిణీ నిర్వహించిన మైల్వార్ గ్రామస్తులం అందరం కలిసి కట్టుగా ప్రతి నెల బాలింత కిట్లు ఇవ్వడం జరుగుతుంది ఆదర్శ గ్రామం అయినటువంటి మా మైల్వార్ గ్రామంలో పుట్టిన పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మా వంతు సహాయంగా ఈ కార్యక్రమం చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగిశెట్టి సతీష్ కుమార్ వార్డ్ మెంబర్ వినోద్ కుమార్ ఉమేష్ రాజు హనుమంతు ఈ రాజు ప్రభు లింగం కుర్వ శేఖర్ నాగప్ప వెంకటప్ప లాలప్ప దశరథ్ బాల గంగాధర్ పెంటప్ప పకీరప్ప నెంబర్ శామప్ప ఆకాష్ఏఎంసీ డైరెక్టర్ సుజాతరాణమ్మ అనిత లక్ష్మి చంద్రకళ కుర్వ శివమ్మ అశోక్ బస్వరాజ్ భరత్ కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, మెండే కృష్ణయ్య యాదవ్
- కొత్తూరు నూతన సీఐ నాగార్జున రెడ్డికి సన్మానం



**కొత్తూర్ ఆగస్టు 02 (ప్రజాజ్యోతి) :** రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా ప్రజారక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్ అన్నారు.కొత్తూరు నూతన సిఐ నాగార్జున రెడ్డిని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, ఆగస్టు 2, (ప్రజాజ్యోతి) :** రామంతపూర్ భరత్ నగర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం ముఖ్యఅతిథిగా పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యి ఆ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు కృపా కటాక్షాలు, ఆయురారోగ్యాల తో సుఖ సంతోషాలతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి ని శాలువాతో సత్కరించి ఆ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెద్దిరాజు సందీప్,ఎండీ తోఫిక్,ఎండీ రఫిక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఉపేందర్ రెడ్డి,గరిక సుధాకర్, శగ శ్రీధర్,గుండమనేని భాస్కర్ ముత్యాల బాబురావు, లూకాస్,భాస్కర్, సత్తిరెడ్డి, జంగయ్య, సత్తయ్య, మేంగ రవి, మేంగశోభా,అశోక్,బుల్లెట్ అశోక్, సచిన్,సంతోష్ ఆలయ కమిటీ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో ఆనందంగా గడిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్



**ఉప్పల్, ఆగస్టు 2, (ప్రజాజ్యోతి) :** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఎంటి నగర్ డివిజన్‌లోని అన్నపూర్ణ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయక శిబిరంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న చిన్నారులు సాయిజెన్ శేఖర్‌కు ప్రేమాభిమానాలకు గుర్తుగా ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు చిన్నారులు చూపిన ఈ అభిమానానికి సాయిజెన్ శేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ వారితో ఆప్యాయంగా ముచ్చటించి స్నేహితుల దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులందరికీ చాక్లెట్లు పంపిణీ చేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. చిన్నారులు ప్రేమతో ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని సాయిజెన్ శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శంభీపూర్‌లోని బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్ 2(ప్రజా జ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్ లోని బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు . ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బోనాల ఉత్సవాల్లో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బోనాలు ప్రజల ఐక్యతను, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబిస్తూ, ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు, తాజా మాజీ కౌన్సిలర్లు, గడ్డపోతారం మునిసిపల్ కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానందకు వినతి పత్రం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 2 ప్రజాజ్యోతి :** కుత్బుల్లాపూర్, గాజులరామారం డివి జన్. గాజుల రామారం విలేజ్ కుమ్మరి బస్తిలో అండర్ డేనేజ్ సమస్యలు సిసి రోడ్ల పనులుతో ఇబ్బందితో ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను కాలనీవాసులు బస్తీ నాయకులు ఎమ్మెల్యే వివేకానంద దృష్టికి తీసుకెళ్లారు వినతి పత్రం ఇవ్వగానే ఎమ్మె ల్యే వివేకానంద వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి త్వరగా మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ ఎస్.సి. సెల్. అధ్యక్షులు డిఎల్‌లక్ష్మణ్. జిసురేష్. కమలాకర్. ఋషి. అంజి కాలనీ వాసులు.

# కరీంనగర్ అభివృద్ధిపైనే నా దృష్టి

## కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తా

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 2( ప్రజాజ్యోతి )
కరీంనగర్ నగర అభివృద్ధిని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి నగర అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.ఆదివారం కరీంనగర్ నగరంలోని 24వ డివిజన్ బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు,



డ్రెయినేజీ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.
అనంతరం కిసాన్ నగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచే మహోత్సవమని పేర్కొన్నారు.బోనాలు కేవలం జాతర మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి, జానపద కళలకు, కుటుంబ బంధాలకు, గ్రామీణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. పోతురాజు నృత్యం మన సంస్కృతిలోని వీరత్వాన్ని ప్రతిబింబిస్తుందని, బోనం తల్లి పట్ల బిడ్డకు ఉన్న అపారమైన భక్తి, ప్రేమకు చిహ్నమని వివరించారు.
ఇంతటి విశిష్టత కలిగిన బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

# శ్రీ దివ్యవాణి పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

జగిత్యాల రూరల్, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి):
జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపెల్లి గ్రామ శ్రీ దివ్యవాణి పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక సంస్కృతికి ప్రతిబింబమైన బోనాల వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.
ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ జాతి గౌరవాన్ని,



సంస్కృతిని, బోనాల పండుగ గొప్పదనాన్ని వివరిస్తూ చేసిన ప్రసంగాలు మరియు నృత్యాలు గ్రామస్తులను ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా పలువురు విద్యార్థులు అమ్మవారి వేషధారణలో చేసిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ సుందర్ తో పాటు ఉపాధ్యాయులు సంధ్య, సంగీత, కీర్తన, కళ్యాణి, విజయ, నివేదిత, శిరీష, శ్రీధర్ మరియు విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బిల్డ్ ఎక్స్‌పో-2026 విజయవంతం... ఆధునిక నిర్మాణ సాంకేతికతకు విశేష స్పందన

కరీంనగర్ టౌన్ ఆగస్టు రెండు (ప్రజా జ్యోతి )
కరీంనగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 6వ బిల్డ్ ఎక్స్‌పో–2026 విజయవంతంగా ముగిసిందని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఏసీసీఈఐ) కరీంనగర్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు




వరంగల్, మంచిర్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, గృహ నిర్మాణ దారులు, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆధునిక నిర్మాణ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీసీఈఐ ప్రతినిధులుఏసీసీఈఐ కరీంనగర్ సెంటర్ చైర్మన్ నల్ల లక్ష్మయ్య, సెక్రటరీ సబ్బని శ్రీనివాస్, ట్రెజరర్ వేణుమాధవ్, కన్వీనర్ పాత పవన క్రిష్ణ, కో–ఆర్డినేటర్ జీ వెంకట కిషన్, పవన కృష్ణ మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రజలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఎక్స్‌పోను నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ నుంచి ఇంటీరియర్ వరకు అవసరమైన స్టీల్, సిమెంట్, పెయింట్స్, హార్డ్‌వేర్, ప్లైవుడ్, లామినేట్స్, లిఫ్ట్లు, వాటర్ ప్రూఫింగ్ కెమికల్స్, ఎలక్ట్రికల్, శానిటరీ ఉత్పత్తులు, యూపీవీసీ విండోస్, పీటీ స్లాబ్ టెక్నాలజీ వంటి అనేక ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గొల్లపల్లి వెంకట్ అనిల్, ప్రశాంత్, పెద్ది ప్రమోద్, ఫణి అసోసియేషన్ ప్రతినిధులు, బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాటేస్తేనే కదులుతారా..?

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం,
- భయాందోళనలో చిన్నారులు, వృద్ధులు,
- నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు,

ఎండపల్లి, ఆగస్టు 2, ప్రజా జ్యోతి మండలంలోని కొన్ని గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గుంపులుగా సంచరిస్తూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్న కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. కుక్కలు ఒక్కసారిగా వెంటపడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది, గ్రామాల్లోని ప్రధాన వీధులు, కాలనీలు, పాఠశాలల పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రివేళల్లో వీటి బెడద మరింత ఎక్కువగా ఉంటోందని ఒంటరిగా నడిచే వారిని వెంబడించడం, వాహనాల వెంట పరుగులు తీయడం, చిన్నారులపైకి దూసుకెళ్లడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

పిల్లలను బయటకు పంపాలంటే భయం..
పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం,సాయంత్రం ఆటల కోసం బయటకు వచ్చే పిల్లల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. కుక్కల గుంపులు కనిపిస్తే పిల్లలు భయంతో పరుగులు తీస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు,వృద్ధులు, మహిళల పరిస్థితి అయితే ఇక చెప్పక్కర్లేదు, ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?
ఇటీవలే కొన్ని గ్రామాల్లో వీధి కుక్కల దాడిలో గాయపడి, పలువురికి విచారకర పరిస్థితి ఏర్పడిన విషయం విదితమే,కాగా కొన్ని గ్రామాల్లో వీధి కుక్కల సమస్యపై పలు గ్రామాల్లోని ప్రజలు పలుమార్లు అధికారులు దృష్టికి గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని గ్రామస్థులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా కుక్కల దాడికి గురై తీవ్రంగా గాయపడిన తర్వాతే స్పందిస్తారా?ప్రాణనష్టం,తీవ్ర గాయాలు సంభవించిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించాలని,ప్రమాదకరంగా మారిన కుక్కలను గుర్తించి తగిన నియంత్రణ చర్యలు తీసుకోవడంతో పాటు, కుక్కల బెడద పునరావృతం కాకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం, అలాగే అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం

గొల్లపెల్లి, ఆగస్టు2(ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లా, గొల్లపెల్లి మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, సాతల్ల లక్ష్మణ్, వేల్పుల రాజేష్ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గోవిందపల్లి గ్రామ సర్పంచ్ మేక స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఎంతో కష్టపడి చదువుకుని, ప్రపంచ దేశాలు గర్వించేలా భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడని కొనియాడారు. ఆయన కృషి వల్లే రిజర్వేషన్ల రూపంలో అందరికీ సమాన హక్కులు దక్కాయని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం నింపుతున్న నామస్మరణ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పడాల తిరుపతి, చెన్న జార్జన్, బికం రాజయ్య, మారంపల్లి రాజకుమార్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేములవాడలో ముదిరాజ్ మత్స్యకారుల భవన నిర్మాణానికి భూమిపూజ

## రూ. 6 లక్షలతో నూతన భవనం.. శంకుస్థాపన చేసిన చైర్మన్ పుల్కం రాజు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ శరవేగంగా అభివృద్ధి

వేములవాడ,ఆగస్టు,2:ప్రజాజ్యోతి. వేములవాడ పట్టణంలో స్థానిక ముదిరాజ్ మత్స్యకారుల నూతన భవన నిర్మాణానికి సుమారు ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఆదివారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్యఅతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ... స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిరంతర సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే పట్టణ పరిధిలోని 54 కుల సంఘాల భవన నిర్మాణాల అభివృద్ధికి ప్రతి సంఘానికి రూ. 6 లక్షల చొప్పున నిధులు కేటాయించి, పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి నోచుకోని కుల సంఘాలను. కానీ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే చేతల ప్రభుత్వమని నిరూపిస్తోందన్నారు. ఇటువంటి భవనాలు నిర్మించడం వల్ల ఆయా సంఘాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. సంఘ సభ్యులందరూ ఒకే చోట చేరి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడానికి, తమ సమాజ పురోగతికి సంబంధించిన విషయాలపై విస్తృతంగా చర్చా కార్యక్రమాలు జరుపుకోవడానికి ఈ భవనాలు వేదికగా నిలుస్తాయని తెలిపారు. అంతేకాకుండా సంఘానికి సంబంధించిన విలువైన వస్తువులు, శుభకార్యక్రమాలు మరియు పండుగల సామాగ్రిని సురక్షితంగా భద్రపరుచుకోవడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని స్పష్టం చేశారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడానికి ఇవి కేంద్ర బిందువులుగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
అలాగే పట్టణాభివృద్ధిపై కొందరు చోటామోటా నేతలు సోషల్ మీడియా వేదికగా నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అలాంటి వారికి స్థానిక ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని చైర్మన్ హెచ్చరించారు. వేములవాడ సమగ్ర పురోగతే లక్ష్యంగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమర్థవంతమైన నాయకత్వంలో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు వెళుతోందని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దృఢ సంకల్పంతో పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారబోతోందని తెలిపారు. పట్టణ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు, రూపురేఖలు మార్చేలా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో ఆరోపణలు చేసే చిల్లర నాయకుల మాటలను ప్రజలు ఎవరూ నమ్మరని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధే వారికి చెంపపెట్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుం మధు, పట్టణ కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్, ముదిరాజ్ మత్స్యకార సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గుండారంలో బోరు మోటార్ కు భూమి పూజ....

ఎల్లారెడ్డిపేట ఆగస్టు 2 (ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 3 లక్షల రూపాయలతో బోరు మోటారు పైప్ లైన్ పనులకు గ్రామ సర్పంచ్కి ముడావత్ సరోజన తో కలిసి మండల సర్పంచ్ల పోరు అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల చెందిన సర్పంచులు ఉప సర్పంచ్ జెట్టి కిషన్ రాజేందర్ పాలకవర్గం కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా నిలిచిన స్పెషల్ బ్రాంచ్ పోలీసు

కథలాపూర్, ఆగస్టు 2(ప్రజాజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన టి.సుగుణ (75) కాలు విరగడంతో శస్త్రచికిత్స కోసం పట్టణంలోని ఓం సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో రక్తం అత్యవసరంగా అవసరమని వైద్యులు చెప్పడంతో



జగిత్యాల రక్తదానం గ్రూప్ సభ్యులను సంప్రదించారు. సమాచారం అందుకున్న పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న కోరుట్లకు చెందిన స్పెషల్ బ్రాంచ్ సురేష్ ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. దీంతో రోగికి సకాలంలో శస్త్రచికిత్స నిర్వహించారు. కాగా ఎస్‌బి సురేష్ 11వసారి రక్తదానం చేయడం విశేషం. అత్యవసర పరిస్థితుల్లో స్పందించి రక్తదానం చేసిన సేవా స్ఫూర్తిని రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

# వ్యవసాయ బావిలో పడి వృద్ధుడి దుర్మరణం



కొడిమ్యాల,ఆగస్ట్ 02,(ప్రజా జ్యోతి): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తిప్పాయపల్లి గ్రామానికి చెందిన గట్ల తిరుపతిరెడ్డి (82) వృద్ధాప్యంతో మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఉదయం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించడం జరిగిందని,మృతుడి కుమారుడు గట్ల రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


కరీంనగర్ టౌన్,ఆగస్టు 2( ప్రజాజ్యోతి )
శ్రీ వాగ్దేవి & ఎస్ డి ఏ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ & డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి మహోత్సవం



సందర్భంగా ఆచార్య అభివందనం కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. గురువుల విశిష్టతను చాటుతూ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది.ముందుగా మహర్షి వేదవ్యాసుల చిత్రపటానికి, గురువులకు పూలమాలలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న 24వ వార్డు బీజేపీ కార్పొరేటర్ వొంటెల సత్యనారాయణ రెడ్డి, ఎస్ వి జె సి ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, "సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉందని, సంస్కారం, క్రమశిక్షణ, కళలు, విద్యను అందించే గురువులను గౌరవించడం మన సనాతన సంప్రదాయం" అని పేర్కొన్నారు.ప్రముఖ ప్రవచనకర్త పాలేపు చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ, వేదాలను వర్గీకరించి మానవాళికి జ్ఞానాన్ని అందించిన వ్యాస మహర్షి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గురుపూజ, తల్లిదండ్రులకు నిర్వహించిన పాదపూజ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులను నాట్య గురువులు టి. సేతురామ శ్వేత, డాన్స్ మాస్టర్ సతీష్ నాయుడు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మహాత్మానగర్ లో ఘనంగా పోచమ్మ బోనాలు

తిమ్మాపూర్ ఆగస్టు 2( ప్రజాజ్యోతి )
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామంలో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు డప్పు చప్పుల్లా మధ్య భక్తి శ్రద్ధలతో



నిర్వహించారు మహిళలు ఉపవాస దీక్షతో బోనాలు ఎత్తుకొని శివశక్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకొని బోనాలు అమ్మవారికి సమర్పించి పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమం లో రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగి వేణుగోపాల్ ఆత్మహత్య పై భట్టి స్పందించాలి..

నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హామీల వల్ల ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది.. ఈ ఆత్మహత్య కు రాష్ట్ర ప్రభుత్వం మే బాధ్యత వహించాలని బీజేవైఎం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్ అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు... ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్



ఆత్మహత్య చేసుకోవడం విషయం అత్యంత బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం గా ఉండాలని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. వేణుగోపాల్ ఆత్మహత్య పరిస్థితులపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. ఒకవేళ నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాలపై నిరాశ లేదా ఇతర కారణాలు ఈ ఘటనకు దారితీసి ఉంటే, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ముఖ్యంగా ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ విడుదల వంటి అంశాలపై ఆలస్యం లేకుండా నిర్ణయాలు తీసుకుని, నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి. యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు చేపట్టాలని కోరారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు

నేలకొండపల్లి, ఆగస్టు 2 ప్రజా జ్యోతి: ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు మండలం లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సోషల్ మీడియా వేదికగా స్నేహితులకు పలు



సందేశాలను పంపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో స్నేహితులు సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కోరట్లగూడెం లో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ షిఫ్ డే ని నిర్వహించారు.
స్నేహితులకు ఫ్రెండ్స్ షిఫ్ బ్యాండ్ కట్టి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు షేక్ సైదా, షేక్ మహబూబ్, పాషా, లాల్పాషా, రావూరి సాయి, కొత్తపల్లి సాయి, గడిపల్లి నవీన్, గుండా అజిత్, షేక్ రాహుల్, మీసాల తేజ, మార్తి భరత్, షేక్ రహీం, బాషా, షేక్ షిలార్, గుండా కోటి, కందికొండ రవితేజ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని ప్రజలకు వివిధ శాఖల అధికారులు వాట్సాప్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే రాగమయిని కలిసిన జి ఎం వెంకటాచారి

సత్తుపల్లి ఆగస్టు02(ప్రజా జ్యోతి) సత్తుపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన సరికొండ వెంకటాచారి,ఆదివారం సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ ను స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే,శాలువాతో, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన



బాధ్యతలు చేపట్టినందుకు అభినందనీయమని,సత్తుపల్లి ఏరియా అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గానికి అందించే సింగరేణి సంస్థ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సహకరించి,ప్రజలకు ఉద్యోగులకు మంచి పరిపాలన అందించాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో జి ఎం బొల్లం శ్రీనివాస్,జేవియర్ ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ లు ఉన్నారు.

## మరీదు స్వామికి సిపిఐ ఘన నివాళి

**నివాళులర్పించిన సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు**

బోనకల్, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ



(సీపీఐ) సీనియర్ సభ్యుడు మరీదు స్వామి (68) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి ఘనంగా నివాళులర్పించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి వంగాల కృష్ణ, వంగాల నారాయణ, వంగాల బ్రహ్మం, వంగాల నాగేశ్వరరావు, గుడిద పెద్ద వెంకటేశ్వర్లు, మరీదు శ్రీను, మరీదు నాగేశ్వరరావు, రాము, వార్డు సభ్యుడు మంద వెంకట్రావమ్మ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోనకల్ బస్టాండ్ ఉన్నా లేనట్లే..?

* నిరుపయోగంగా కనిపిస్తున్న బోనకల్ బస్టాండ్
* యాచకులకు, కుక్కలకు పరిమిత మైన బస్టాండ్
* తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
* గత పాలకులు పట్టించుకోలేదు
* ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు
* బస్టాండ్ సౌకర్యార్థం లేక ప్రయాణికుల ఇబ్బందులు
* ఇకనైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఉపయోగంలో ఉండే విధంగా కృషి చేయాలి
* ముక్తకంఠంతో కోరుతున్న మండల ప్రజలు

బోనకల్, ఆగస్టు 02(ప్రజా జ్యోతి): ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు నేటికీ బోనకల్ బస్టాండ్ గురించి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. లక్షల రూపాయలు పెట్టి కట్టిన బోనకల్ బస్టాండ్ నేటికి ఉపయోగంలో లేకుండా పోయింది. బోనకల్ మండల కేంద్రంలో బస్టాండు ఉన్నా లేనట్లుగా కనిపిస్తుంది. నేటికీ కూడా బోనకల్ బస్టాండు నిరుపయోగంగా కనిపిస్తుంది. దీనితో బస్సు సౌకర్యార్థం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు సౌకర్యార్థం కొరకు నిర్మించిన ఈ బస్టాండ్ లో పిచ్చి చెట్లు మొలచి నిరుపయోగంగా ఉండటంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ బస్టాండ్ నిరుపయోగంగా ఉండటమే కాకుండా శిథిలావస్థకు చేరినట్లు కనిపిస్తుంది.? అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా



వ్యవహరిస్తున్నారు. బోనకల్ మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. 22 గ్రామాల ప్రజలకు ఈ బస్టాండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం కొరకు అధికారులు మాత్రం ఈ బస్టాండ్ గురించి పట్టించుకున్న పాపాన లేదు. ఈ మధ్యనే హడావుడిగా నిరుపయోగంగా ఉన్న ఈ బస్టాండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. కాంపౌండ్ వాళ్ళు నిర్మిస్తుంటే మండల ప్రజలు చూసి ఈ బస్టాండ్ ఉపయోగంలో వస్తుందిలే అనుకున్నారు. కానీ కాంపౌండ్ వాళ్ళు నిర్మించారు. ఆ తర్వాత బస్టాండ్ గురించి మాత్రం పట్టించుకోవడం మరిచారు. ఒకప్పుడు ఖమ్మం, మధిర డిపో బస్ సర్వీసులు బస్టాండ్కు వచ్చి వెళ్ళేవి. ఇవి కూడా కొన్ని సంవత్సరాలు మాత్రమే నడిచాయి. ఆ తర్వాత నుండి ఈ బస్టాండ్కు బస్సులు రావడం లేదు. ప్రస్తుతం ఈ బస్టాండ్ నేటికీ ప్రయాణికులకు ఉపయోగపడకుండా యాచకులకు, కుక్కలు పడుకోవడానికి ఉపయోగపడుతుంది. దీనితో ఈ ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరింది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు 2 – 7– 1988 న నాటి రాష్ట్ర చిన్న తరహా నీటి వనరుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ బస్టాండ్కు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఈ ప్రయాణ ప్రాంగణం బాగానే కొనసాగింది. గత పది సంవత్సరాల నుండి ఈ బస్టాండ్ నిరుపయోగంగా ఉన్నది. గతంలో కొంతమంది పెద్దలు ఈ బస్టాండ్ ను అభివృద్ధి చేయడానికి అభివృద్ధి కమిటీని వేశారు. ఆ తర్వాత బస్టాండ్ అభివృద్ధి కోసం నాటి బిఆర్ఎస్ పాలనలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న మహేందర్ రెడ్డిని కలిశారు. బోనకల్ బస్టాండ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం కొరకు బస్సులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఆ తర్వాత కొన్ని రోజులు బస్సులు ఈ బస్టాండ్ కు వచ్చాయి. మూడు నాళ్ళ ముచ్చటగా వచ్చాయి.
ఆ తరువాత మళ్లీ రాకుండా ఆగిపోయాయి. మండలంలో ఇతర గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు బస్సులు, ఆటోలు వచ్చేవరకు ఉండటానికి బస్టాండ్ లేక వర్షాలకు తడుస్తూ, ఎండలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికులకు సౌకర్యార్థాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలుస్తుంది.?
నాటి బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో నాయకులు బోనకల్ మండల కేంద్రంలో ఉన్న ఈ బస్టాండ్ ను పట్టించుకున్న పాపాన లేదు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్న ఈ బస్టాండ్ వైపు కన్నెత్తి చూడడం మరిచారు. ఇప్పటికైనా ప్రయాణికుల సౌకర్యార్థ గురించి ఆలోచించి నిరుపయోగంలో ఉన్న బోనకల్ బస్టాండ్ ను ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు బోనకల్ బస్టాండ్ గురించి స్పందిస్తారా లేదా వేచి చూడాలి.?

# చైతన్య నవసారథులు. నవ చైతన్య యువకులు

## సమాజ శ్రేయస్కై యువత ముందుండాలి
## స్నేహభావంతో యువత సన్మార్గంలో పయనించాలి

గుండాల ఆగస్టు 2 ప్రజా జ్యోతి: సమాజ శ్రేయస్సు కై స్నేహభావంతో యువత ముందుండాలని గుండాల ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు యాసారపు తిరుపతి, తవిడిశెట్టి నాగరాజు ,, ఎట్టి సుందర్, కానిస్టేబుల్ మంగయ్య లుఅన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవ సందర్భంగా గుండాల మండల కేంద్రంలోని కిన్నెరసాని వాగులో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. స్నేహితుల దినోత్సవ సందర్భంగా నవ చైతన్య యువజన సంఘం యువకుల ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు కిన్నెరసాని వాగులో సరదాగా స్నేహితులతో యువకులంతా గడిపారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నవచైతన్య యోజన సంఘం యువకులు ఆజాద్, సంతోష్, వినయ్ ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు ఫ్రెండ్స్ షిప్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుండాల మండల కేంద్రానికి చెందిన యువకులంతా పాల్గొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ యువత నడవడికపై చర్చించుకున్నారు. నవ చైతన్య యోజన సంఘం చేస్తున్న కార్యక్రమాలపై ప్రశంసిస్తూ, యువత ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ సమాజాన్ని చైతన్య పరుస్తూ అనేక సేవా కార్యక్రమాలలో ముందుంటుందని అన్నారు. నేటి ఈరోజులలో యువత అనేక చెడు అలవాట్లకు బానిసలై కుటుంబానికి దూరమవుతుండగా గుండాల నవ చైతన్య యువత అనేక సేవా కార్యక్రమాలతో పాటు సమాజాన్ని చైతన్య పరుస్తూ, స్నేహ దుప్పదంతో ముందుండి పనిచేస్తుందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కే పాప చారి, వై యాకయ్య, ఎండి యాకూబ్, జి నారాయణ, ఎం రంజిత్, టి సురేష్, బి సారంగపాణి, పి రాము, జగన్, సుధాకర్, ఎం సావన్, జి లక్ష్మణ్, వై సురేష్, వి సాగర్, అనిల్, నరేష్, అశోక్, శివాజీ, కోటేష్, నవీన్, నరేష్, కైసర్, రాము, రంజిత్, నిఖిల్, నవీన్, పవన్, వరుణ్, షాయద్, శ్రీను, శశి, శోభన్, హరీష్, వంశీ, హరీష్, రవి వర్మ, రోషన్, సతీష్ రాంబాబు, శరత్, సిద్దు, ప్రణయ్, జగన్, రాము, ప్రమోద్, ప్రశాంత్, నవీన్, పూజిత్ నితీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు





## స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం**

మణుగూరు, ఆగస్టు 2, ప్రజా జ్యోతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం: మండల పరిధిలోని శివలింగాపురం సి.యు.పి.ఎస్. పాఠశాలలో 1996 నుండి 2002 వరకు వివిధ సంవత్సరాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ చిన్ననాటి



జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ కలిసి తాము చదువుకున్న పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను సందర్శిస్తూ విద్యార్థి దశలోని మధుర స్మృతులను పంచుకున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్నేహితుడు లాలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరం కలిసి మా పాఠశాలలో సమావేశమై ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు. చిన్ననాటి స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సంతోషాలు, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు స్నేహబంధాలను చిరస్థాయిగా నిలబెట్టడమే కాకుండా సమాజానికి, పర్యావరణానికి కూడా మంచి సందేశాన్ని అందిస్తాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, లాలు, రవి ప్రసాద్, రమేష్, రాజేశ్వరరావు, ఇస్మాయిల్, అశోక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు...

# ప్రజల కోసం జీవించిన నాయకుడు ప్రకాష్ రావు

★ తూము ప్రకాశరావు జ్ఞాపకార్థంగా 71వ ఉచిత, బీపీ షుగర్ వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, ఆగస్టు 02 (ప్రజా జ్యోతి): ప్రజల కోసం జీవించి, ప్రజల కోసమే అమరుడైన తూము ప్రకాశరావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన పోరాట బాటనే సమసమాజ నిర్మాణానికి మార్గమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెల నిర్వహించే 71వ ఉచిత బీపీ, షుగర్ ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ... నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. పేదలు, వ్యవసాయ కూలీలు, దళితుల హక్కుల కోసం తూము ప్రకాశరావు నిరంతరం పోరాడారని, ఆయన జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. కలకోట, రాయన్నపేట గ్రామాల్లో ఎస్సీ కాలనీల ఏర్పాటు, దళితులకు చేపల సొసైటీ హక్కులు కల్పించడం, భూపోరాటాల ద్వారా



కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, సిరిపురం మల్లవరం గ్రామాల్లో బంజరు భూములను పేదలకు పంపిణీ చేయించడంలో తూము ప్రకాశరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని సహించలేని పెత్తందారీ శక్తులు కుట్రపూరితంగా హత్య చేసినప్పటికీ, ఆయన ఆశయాలను మాత్రం అంతం చేయలేకపోయాయని అన్నారు. ప్రకాశరావు అమరత్వానికి 43 సంవత్సరాలు పూర్తవుతున్నా ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉండటం ఆయన చేసిన సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, తూము ప్రకాశరావు ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ సదానందం, డాక్టర్ మధుసూదన్ సుమారు 100 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నెల రోజుల పాటు సరిపడే నాణ్యమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామీణ ప్రజలకు ప్రతి నెలా అందుతున్న ఈ ఉచిత వైద్య సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీడబ్ల్యూఏ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు, సీపీఐ నాయకులు ఆకెన పవన్, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు దుగ్గి భద్రయ్య, క్యాంపు సహాయకులు గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

## నిండుకుండలా జలాశయాలు

వాయవ్య బంగాళాఖాతంలో ఇటీవల వాయుగుండం ఏర్పడి వర్షాలు కురిపించడంతో.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కుండపోత వర్షాల కారణంగా రెండు రాష్ట్రాల్లోని నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణ, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోగా, దట్టమైన అటవీ ప్రాంతాల్లోని సహజసిద్ధ జలపాతాలు సరికొత్త జీవం పోసుకుని ఉధృతంగా జాలువారుతున్నాయి. తెలంగాణ నయాగరాగా పేరున్న ములుగు జిల్లా.. వాజేడు మండలం.. చీకుపల్లి అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ బొగత జలపాతం.. ఎగువ ప్రాంతాల



నుంచి వస్తున్న భారీ వరదలతో ఉగ్రరూపం దాల్చింది. దాదాపు 160 మీటర్ల వెడల్పు, 50 అడుగుల ఎత్తు నుంచి ఐరావతాన్ని తలపించేలా జలధారలు హోరెత్తుతూ కిందకు దూకుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు జలపాతం దగ్గర నీటి ప్రవాహం అమాంతం పెరిగిపోవడంతో, పర్యాటకుల భద్రత కోసం జలపాతం దగ్గర ఏర్పాటు చేసిన సేఫ్టీ కారిడార్ కూడా పూర్తిగా నీట మునిగిపోయింది. ఈ భయానక వాతావరణం ప్రకృతి ప్రేమికులను విపరీతంగా ఆకర్షిస్తున్నప్పటికీ, అక్కడి ప్రమాద తీవ్రతను కూడా స్పష్టం చేస్తోంది.బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా.. ములుగు జిల్లా అటవీ శాఖ, పోలీసు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఏ క్షణంలోనైనా మరింత పెరిగే అవకాశం ఉండటం, అలాగే రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో అధికారులు జలపాతాన్ని దూరం నుంచే చూసే వీలు కల్పిస్తున్నారు. దగ్గరకు వెళ్లే ఛాన్స్ లేదు. జలపాతం పరిసర ప్రాంతాల్లో ఎవరూ తిరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గి, పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు పర్యాటకులు ఎవరూ బొగత జలపాతం దగ్గరకు వెళ్లే వీలు లేదు.పర్యాటకుల రద్దీ, జలపాతాల దగ్గర పొంచి ఉన్న ప్రమాదాల గురించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్వయంగా స్పందించి పలు కీలక సూచనలు చేశారు. ములుగు జిల్లాలోని బొగత జలపాతం తదితర ప్రకృతి అందాలను వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులకు స్వాగతం పలుకుతూనే, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆమె ఆదేశించారు. ప్రకృతి అందాలను చూసే ఆనంద యాత్రను విషాదంగా మార్చుకోవద్దనీ, ప్రమాదకరమైన నీటిలో దిగడం లేదా సెల్ఫీల కోసం నిషేధిత ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను రిస్క్ చేయవద్దని మంత్రి సీతక్క పర్యాటకులను ప్రత్యేకంగా కోరారు. బొగత మాత్రమే కాకుండా తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఇతర ప్రసిద్ధ జలపాతాలు కూడా ఇప్పుడు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన కుంతల జలపాతం, దానికి సమీపంలో ఉండే పొచ్చెర జలపాతాలు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా నిండుకుండల్లా మారి సందడి చేస్తున్నాయి. కొన్ని రోజుల కిందటి వరకు నీరు లేక వెలవెలబోయిన ఈ పర్యాటక ప్రాంతాలు, ఇప్పుడు భారీ వరద నీటితో కనువిందు చేస్తుండటంతో వీకెండ్ ట్రిప్స్ కోసం హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని జలపాతాలు, ప్రాజెక్టులు కూడా ఈ వర్షాలకు పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకున్నాయి. గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధ ఎత్తిపోతల జలపాతం, స్థానికంగా ఉన్న వాగులు ఉప్పొంగడం వల్ల ఎంతో రమణీయంగా కిందికి ప్రవహిస్తోంది. మరోవైపు కర్ణాటక నుంచి వస్తున్న భారీ వరదల కారణంగా శ్రీశైలం, జూరాల వంటి ప్రధాన జలాశయాలకు లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాలు పూర్తిగా వరద నీటితో నిండిపోయి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి.

గోదావరి నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరగడంతో తీరప్రాంతాలు, ముఖ్యంగా లంక గ్రామాల్లో వరద ముప్పు తీవ్రరూపం దాల్చుతోంది. వరదనీరు గ్రామాల్లోకి చేరడంతో ముమ్మిడివరం నియోజకవర్గంలోని శేరిలంక, కమిని, పశువులలంక, గురజాపులంక, కూనలంక, తానేలంక, పొట్టిలంక తదితర గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పరిస్థితులు మరింత విషమించకముందే ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. వరద ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు సహాయక చర్యలను ముమ్మరం చేసింది. బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది.

## బాధితుడికి న్యాయం చేయాలి: నవోదయ సిద్ధార్థ

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 2: నారాయణఖేడ్ మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన దుర్గయ్య తనకు చెందిన 33 గుంటల భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ, తనకు న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో సంస్థ చైర్మన్ నవోదయ సిద్ధార్థకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన నవోదయ సిద్ధార్థ ఆదివారం బాణాపూర్ గ్రామాన్ని సందర్శించి, గ్రామ సర్పంచ్ విజయ్‌తో కలిసి



ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాసుల శ్రీశైలంను కలిసి బాధితుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ..బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిజానిజాలు వెలికి తీసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు, బలహీన వర్గాలకు చెందిన వారి భూములను అక్రమంగా కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుడికి పూర్తి న్యాయం జరిగే వరకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అండగా ఉంటుందని తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఇలాంటి సమస్యలపై భయపడకుండా చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్, సంగారెడ్డి, మేడ్చల్, జిల్లాల అధ్యక్షులు గాల్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, సంగారెడ్డి జిల్లాల ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్, జిల్లా కార్యదర్శి ప్రసాద్, కుత్బుల్లాపూర్ మండల్ ఉపాధ్యక్షులు సాయి, సంస్థ నాయకులు సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలలు గడిచినా పురోగతి సాధించని జోగు సంగీత కేసు

**హత్యను సాధారణ మృతిగా చిత్రీకరించారనే ఆరోపణ**

**బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం**

**జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి: నవోదయ సిద్ధార్థ**

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 2: జోగు సంగీత హత్య కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం కంగ్టి మండలం దెగులువాడి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ..జోగు సంగీత హత్య జరిగినప్పటికీ కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ..బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారి వినతిపై దెగులువాడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు




తెలిపారు. జోగు సంగీత భర్త జోగు విజయ్ మే 27న ఆమె కనిపించడం లేదని కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని ఆయన ఆరోపించారు. అనంతరం మే 29న గ్రామ శివారులో జోగు సంగీత (26) మృతదేహం ఎడమ చేయి లేకుండా లభించిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ ఆ నివేదికను కుటుంబ సభ్యులకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. రెండు నెలలు గడిచినా కేసులో గణనీయమైన పురోగతి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే వారిని భయపెట్టడం బాధాకరమని విమర్శించారు. చట్టం అందరికీ సమానమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ సంస్థ తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చివరగా జోగు సంగీత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నవోదయ సిద్ధార్థ నేతృత్వంలోని బృందం కంగ్టి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై దుర్గారెడ్డిని కలిసి జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి, నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి



న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ , సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గాల్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, సాయిలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. ఖైసర్, సంతోష్‌రావు పాటిల్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బహుజన ప్రసాద్, కుత్బుల్లాపూర్ మండలం ఉపాధ్యక్షులు సాయి, సంస్థ నాయకులు సురేష్ గౌడ్, గ్రామస్తులు విశ్వనాథ్, శంకర్ , భీమప్ప ప్రకాష్ , బాధితులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లష్కర్ బోనాలతో సికింద్రాబాద్ భక్త ప్రభంజనం

మొదటిపేజీ తరువాయి..

వస్త్రాలు ధరించి, వేప ఆకులు, పసుపు, బెల్లం, వండిన అన్నంతో అలంకరించిన బోనాలు తలపై మోసుకొని అమ్మవారికి సమర్పిస్తున్నారు. ఇలా లష్కర్ బోనాలతో సికింద్రాబాద్ ప్రాంతాల్లో భక్త ప్రభంజనం కనిపిస్తోంది. ఆలయం సుమారు 211 సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. 1813లో సికింద్రాబాద్‌లో ప్లేగు వ్యాధి వ్యాపించినప్పుడు, నిజాం సైన్యంలోని డోలి బేరర్ సురిటి అప్పయ్య.. ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ప్రార్థనలు చేసి, వ్యాధి తగ్గితే సికింద్రాబాద్‌లో విగ్రహం ప్రతిష్ఠించాలని మొక్కుకున్నారు. వ్యాధి తగ్గిన తర్వాత 1815లో చెక్క విగ్రహం ప్రతిష్ఠించారు. తర్వాత 1864లో నల్ల రాతి విగ్రహం ఏర్పాటు చేశారు. ఉదయం 4 గంటల నుంచి అమ్మవారి దివ్యదర్శనం ప్రారంభమైంది. ప్రధాన అర్చకులు రామతీర్థశర్మ ప్రకారం, ఉదయం 3 గంటలకు అభిషేకం, అర్చన జరిగి, 4.05 నిమిషాలకు మహాహారతి తర్వాత దర్శనం కొనసాగింది. సోమవారం రాత్రి 12 గంటల వరకు నిరంతరం కార్యక్రమాలు ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మహాహారతిలో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. నేడు ఉదయం 8.30 లేదా 9 గంటలకు రంగం కార్యక్రమం జరుగుతుంది. ఈ సంప్రదాయంలో జోగిని మట్టి కుండపై నిలబడి అమ్మవారి రూపంలో భవిష్యవాణి చెబుతారు. ఇది రాష్ట్ర క్షేమం, వర్షాలు, ప్రజల శ్రేయస్సు గురించి సూచనలు ఇస్తుంది. రంగం తర్వాత ఉదయం 10.30 గంటలకు అమ్మవారి గజవాహన (అంబారీ) ఊరేగింపు జరుగుతుంది. కర్ణాటక నుంచి వచ్చిన లక్ష్మి అనే ఏనుగు ఈ ఊరేగింపులో పాల్గొంటుంది.



భక్తుల సౌకర్యం కోసం ఆలయ కమిటీ ఆరు ప్రత్యేక క్యూ లైన్లు (మహిళలకు), నాలుగు ఎగ్జిట్ లైన్లు ఏర్పాటు చేసింది. వృద్ధులు, మహిళలకు అదనపు మార్గాలు ఉన్నాయి. 500 మంది వాలంటీర్లు, 2500 మంది పోలీసు సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. విద్యుత్ శాఖ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నిరంతర సరఫరా ఉండేలా చేస్తోంది. టీజీఎస్‌ఆర్టీసీ 175 ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

ఎంజీబీఎస్, చార్మినార్, మెహిదీపట్నం, అల్వాల్, కుషాయిగూడ వంటి ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు సేవలు అందుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఆగస్టు 2 నుంచి 4 వరకు ఆలయం చుట్టూ 2 కిమీ పరిధిలో రోడ్లు మూసివేసి, మళ్లింపులు అమలు చేస్తున్నారు. కర్బలా మైదాన్, రాణిగంజ్, ప్యారడైజ్, పట్నీ జంక్షన్లలో రద్దీ ఉంటుంది. 14 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతం తాత్కాలిక దుకాణాలు, పూల స్టాళ్లు, పిల్లల కోసం మెరీ–గో–రౌండ్‌లతో అలంకరించారు. ఊరేగింపు వాహనాలు లైట్లు, సౌండ్ సిస్టమ్‌లతో అలంకరించారు. దాదాపు లక్ష మందికి పైగా భక్తులు రావచ్చని అంచనా. ఎల్ నినో పరిస్థితులతో ఆందోళన చెందుతున్న భక్తులు.. రంగం భవిష్యవాణి కోసం ఎదురుచూస్తున్నారు.

## ఇండోనేషియాలో ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

పెరాక్ రేవు నుంచి దక్షిణ సులవేసిలోని మకాసర్‌కు ఫెర్రీ వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం పోర్టు నుంంచి ఫెర్రీ ప్రయాణం మొదలైన కొన్ని గంటల తర్వాత మంటలు చెలరేగినట్లు కెప్టెన్ సమాచారం అందించారని.. కొద్దిసేపటికే దానితో సంబంధాలు తెగిపోయాయని అధికారులు చెప్పారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇప్పటి వరకు మొత్తం 225 మంది రక్షించినట్టు అధికారులు వెల్లడించారు. కాగా, ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రయాణికులు ఫెర్రీ ముందు భాగానికి వచ్చి.. సాయం కోసం హాహాకారాలు చేస్తున్నారు. లైఫ్ జాకెట్లు ధరించిన ప్రయాణికులు నౌకకు ఒక వైపున గుమిగూడి ఉండగా, కొందరు నౌక నుంచి నీటిలోకి దూకుతున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సహాయక చర్యలు వేగవంతం చేశామని, గల్లంతైనవారికి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. సపుడి ద్వీపానికి ఉత్తరాన సుమారు 19 నాటికల్ మైళ్ల దూరంలో ఫెర్రీ ఉన్నట్లు సురబయ రెస్క్యూ ఆఫీసు తెలిపింది. ఆ నౌక దాదాపు పూర్తిగా మంటల్లో చిక్కుకుందని, ప్రయాణికులు ముందు భాగంలోకి వచ్చి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారని అధికారులు తెలిపారు. దానికి సమీపంలోని అనేక నౌకలు సహాయక చర్యలలో పాల్గొన్నాయి.



# వారం రోజుల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ!

మొదటిపేజీ తరువాయి..

ఇతర కీలక పదవుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అన్ని స్థాయిల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ కోసం అర్హులైన, క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తల పేర్లతో కూడిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సమర్పించాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్ని జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ పదవుల ఎంపిక, వర్గీకరణకు సంబంధించి ఇటీవల న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమగ్రంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. అధికారంలోకి రావడం కోసం క్షేత్రస్థాయిలో చెమటోడ్చిన నిజమైన కాంగ్రెస్ సైనికులకు తగిన గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం అడుగులు వేస్తోందన్నారు.ఈ ఎంపిక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తెస్తూ పార్టీ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కాంగ్రెస్ మండల, జిల్లా కార్యవర్గాల్లో, అనుబంధ సంఘాలలో చురుగ్గా పనిచేసి పార్టీ బలోపేతానికి, ఆందోళన కార్యక్రమాలకు ముందుండి నడిపిన వారికి, అలాగే నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులకు ఏకంగా 60 శాతం నామినేటెడ్ పోస్టులను కేటాయించాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి రాజకీయ, నాయకుల సిఫార్సులు లేకుండా కేవలం పార్టీకి అందించిన సేవలు, కష్టపడే తత్వాన్నే ప్రామాణికంగా తీసుకుని నేరుగా అర్హులకు అవకాశం కల్పిస్తామని మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ బృహత్తర ప్రక్రియకు అవసరమైన విధివిధానాలు ఖరారు చేసేందుకు శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై లోతుగా చర్చించారు. భవిష్యత్తులో రాబోయే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) డైరెక్టర్లు, ఛైర్‌పర్సన్లు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులకు నిజమైన నిబద్ధత గల పార్టీ కార్యకర్తలను గుర్తించే బాధ్యతను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు అప్పగించారు.

## దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లు

మొదటిపేజీ తరువాయి..

ఇంజినీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే.. అలాంటి వారిని 'క్రిమినల్ వేస్ట్' అని రేవంత్‌రెడ్డి అనడం తగదని అన్నారు. దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ ఉపాధిని అందిస్తున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. సీఎం చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన



నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత, యువతకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే అర్హత కోల్పోయారని విమర్శించారు. యువత గురించి రాహుల్ గాంధీ చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి విద్యార్థులను, ఇంజినీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నారని ప్రస్తావించారు. దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువత కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తున్న అడ్డమైన వ్యాఖ్యలను గమనిస్తోందని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులనే కాకుండా ఇంజినీరింగ్ టీచర్లను తప్పుగా మాట్లాడారని ధ్వజమెత్తారు. యువతపైన, విద్యార్థులపైన అడ్డగోలుగా నోరు పారేసుకోవడం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని ఆగ్రహించారు. తెలంగాణ యువత ఆత్మగౌరవంపైన, ఆత్మవిశ్వాసంపైన రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గ్రీస్ దేశంలో భయంకరమైన కార్చిచ్చు

### అటవీ ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో మంటలు

### నివాస ప్రాంతాలకు వ్యాపిస్తున్న కార్చిచ్చు

గ్రీస్ దేశాన్ని భయంకరమైన కార్చిచ్చు వణికిస్తోంది. రాజధాని ఏథెన్స్ పరిసర ప్రాంతాలతో పాటు పలు గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో మంటలు తీవ్రస్థాయిలో చెలరేగుతున్నాయి. తీవ్రమైన ఎండలు, ఈదురు గాలుల కారణంగా మంటలు వేగంగా నివాస ప్రాంతాలకు వ్యాపిస్తుండటంతో వందలాది ఇళ్లు దహనమయ్యే ప్రమాదంలో పడ్డాయి. ప్రాణాలు దక్కించుకోవడానికి స్థానిక ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది కలసి నీటి పైపులు, చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నారు. అధికారులు అనేక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. జూలై నెల అంతటా స్పెయిన్, గ్రీస్, ఫ్రాన్స్, ఇటలీ మరియు పోర్చుగల్ దేశాల్లో వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని బూడిద చేసిన మంటలు, ఆగస్టు నెల ప్రారంభమైనప్పటికీ ఎక్కడా తగ్గుముఖం పట్టడం లేదు. తీవ్రమైన ఎండలు, పొడి వాతావరణం మరియు బలమైన గాలుల కారణంగా రికార్డు స్థాయిలో వినాశనం జరుగుతోంది. వందలాది నివాసాలు కాలిబూడిదవ్వగా, వేలాది మంది ప్రజలను, పర్యాటకులను సురక్షిత ప్రాంతాలకు ఖాళీ చేయిస్తున్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967